

గోల్డ్ 'రేస్..'

- అడ్డుఅదుపు లేకుండా పరుగులు తీస్తున్న బంగారం ధరలు
- అమెరికా-చైనా వాణిజ్య సుంకాల భయంతో ప్రకంపనలు
- లక్షకు చేరువైన 22 క్యారెట్లు.. లక్ష దాటేసిన 24 క్యారెట్లు
- కళ్లు బైర్లు కమ్మే స్థాయి ధరలతో దుకాణాలన్నీ వెలవెల
- వివాహాలు భారీగా ఉన్నా ఆభరణాల కొనుగోళ్లు అంతంతే
- చిన్నాచితకా దుకాణాలు, స్వర్ణకారుల పరిస్థితి దయనీయం
- భారీగా పెరిగిన బంగారం ధరలతో జీఎస్టీ వసూళ్లు డౌన్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అడ్డుఅదుపూ లేదు.. ఎంతవరకు వెళ్తుందో తెలీదు.. కొందామంటే కళ్లు బైర్లు కమ్మేస్తున్నాయి.. అసలు భవిష్యత్తులోనైనా ధర దిగివస్తుందా అంటే.. ఆ ఆశలు వదిలేసుకోమంటున్నాయి పరిస్థితులు.. ఇంట్లో వివాహం ఉన్నా సరే అటువైపు కన్నెత్తి చూడ్డానికే బెంబేలెత్తే పరిస్థితి.. అమెరికా-చైనా వాణిజ్య సుంకాల భయంతో కొన్ని వారాలుగా రేసు గుర్రంలా బంగారం ధరలు పట్టు విడుపులు లేకుండా పరుగులు తీస్తున్నాయి. తాజాగా బంగారం ధర మంగళవారం లక్ష దాటేసింది. 22 క్యారెట్ల బంగారం ధర లక్ష వైపునకు ఎగబాతుండగా 24 క్యారెట్లు అయితే లక్ష దాటేసి రూ.1,01,350కి చేరింది. దీంతో బంగారం చరిత్రలో తొలిసారి ఇంత ధరకు చేరడంతో జనం నోరెళ్లబెడుతున్నారు. ఈ ధరలు మున్ముందు ఇంకా భారీగా పెరుగుతాయన్న అంచనాలతో పసిడి ప్రియులు కలవరపడుతున్నారు. వాస్తవానికి ప్రజలు ధనిక, పేదరికం తేడా లేకుండా బంగారం కొనుగోలుకు మొగ్గుచూపుతారు. వివాహాలు, ఇతర శుభకార్యాల కోసం ముందుగానే పసిడి తమ స్థాయికి తగ్గట్టు కొంటారు. కానీ ఇప్పుడు పుత్తడి కొనే పరిస్థితి లేకపోవడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జనం అసలు బంగారం దుకాణాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ప్రస్తుతం వివాహాల సీజన్ నడుస్తుండడంతో పెళ్లి కుటుంబాలు, బంధువులు కాస్త ధర ఎక్కువ అయినా తప్పనిసరిగా ఆభరణాలు కొనుగోలు చేస్తారు. కానీ ప్రస్తుత ధరలతో బెంబేలెత్తి సగానికిపైగా కొనుగోళ్లు తగ్గించేస్తున్నారు. బంధువులైతే ఆభరణాలు చదివించడం మానేసి డబ్బులు చదివిస్తున్నారు. అటు ఉమ్మడి జిల్లాలో చిన్నాపెద్దా కలిపి 750వరకు ఆభరణాల దుకాణాలు ఉండగా, వీటికి యాభై శాతం వ్యాపారం పడిపోయింది. కొనుగోళ్లు లేక ఇవన్నీ ఈసురోమంటున్నాయి. చిన్నచిన్న దుకాణాలైతే ఆర్డర్లు తీసుకోవడం మానేశాయి. తీరా తీసుకున్న తర్వాత ధరలు మరింత పెరిగితే నష్టపోతామనే భయంతో షాపులు మూసివేయాల్సిన పరిస్థితి. ఒక్క కాకినాడ నగరంలోనే రోజుకు రూ.5 కోట్ల వరకు ఆభరణాల వ్యాపారం జరగ్గా, ఇప్పుడు రూ.2 కోట్లు కూడా దాటడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కాగా గోల్డ్ వ్యాపారం పూర్తిగా పడిపోవడంతో కోట్లలో వచ్చే జీఎస్టీ వసూళ్లు సైతం పడిపోయాయి.



గింజుకున్నా.. కొనరే!

- రబీ ధాన్యం కొనుగోలు తీరుపై అనుమానాలు
- రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లిన అన్నదాతలకు చుక్కలు
- మిల్లర్లు బీజీలు ఇవ్వలేదనే సాకుతో పంట కొనుగోలుకు తిప్పలు
- తేమశాతం సాకుతోనూ ఇబ్బంది పెడుతున్న సేవా కేంద్రాలు
- కాకినాడ జిల్లాలో రబీ ధాన్యం దిగుబడి 5 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇందులో 80 వేల మెట్రిక్ టన్నులే సేకరణ టార్గెట్
- విమర్శలు రావడంతో 3.40 లక్షల మె.టన్నులు కొంటామంటూ సవరణ

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రబీ ధాన్యం సేకరణ తీరు అన్నదాతలను నిలువునా ముంచేసేలా కనిపిస్తోంది. ఎక్కడికక్కడ రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిన అధికారులు అదిగో ఇదిగో అంటూ అన్నదాతలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. తొంభైశాతం మంది మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చేసినా ఇంకా ఇవ్వకపోవడం వల్లే కొనుగోళ్లు జాప్యం అంటూ అబద్ధాలు చెబుతున్నారు. అటు తేమశాతం పేరుతోను రేటులో కోత కోస్తూ రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. అయితే ఇదంతా కేవలం ధాన్యం సేకరణ నుంచి తప్పించుకోవడానికే ఇన్ని ఎత్తులు అనే అనుమానాలు బలపడుతున్నాయి. కాకినాడ జిల్లాలో రబీ సీజన్‌లో అయిదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. మొత్తం ధాన్యం కొనుగోలు చేయడానికి అనుమతులు లేనందున 80 వేల మెట్రిక్ టన్నులే కొనుగోలుకు మొగ్గుచూపారు. ఇదే విషయాన్ని అధికారులు బయట వెల్లడించారు. తీరా ఆ తర్వాత విమర్శలు రావడంతో వెనక్కు తగ్గారు. 80వేల మెట్రిక్ టన్నులు కాదని.. ఎంత ధాన్యం వచ్చినా కొంటామంటూ మాటమార్చారు. ఈ జిల్లాలో ఈనెల 3 నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభమైంది. రైతు సేవా కేంద్రాల వద్ద అధికారులు అన్నదాతల నుంచి ధాన్యం కొనడం ప్రారంభించారు. తీరా ఇన్ని రోజుల్లో ఇప్పటివరకు సేకరించింది కేవలం 13 వేల మెట్రిక్ టన్నులే. ఒకరకంగా ఇది చాలా దిగదుడుపు. అయితే రైతులు మాత్రం చేతికి వచ్చిన పంటను తీసుకుని ట్రాక్టర్లలో కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్తే అధికారులేమో ధాన్యం కొనడం లేదు. దీంతో రోజుల తరబడి నిరీక్షించి అన్నదాతలు ఈసురోమంటున్నారు. కరప మండలంలో అయితే తెచ్చిన ధాన్యాన్ని అధికారులు కొనకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఇక్కడే కాదు చాలా మండలాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. ఇదేంటని రైతులు అధికారులను నిలదీస్తే మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వకపోవడంతో కొనుగోలులో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇదేదీ నిజం కాదని తేలింది. జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు 116 మంది మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాల్సి ఉండగా, 103 మంది ఇచ్చారు. మిగిలిన 13 ఒకటి రెండు రోజుల్లో పూర్తికాన్నాయి. అయితే ఈ నిజాలన్నీ పక్కనపడేసి అధికారులు అబద్ధాలు చెబుతుండడం సేకరణ లక్ష్యానికి దూరంగా ఉండడానికేనని అర్థమవుతోంది. ఇక పలు కేంద్రాల్లో రైతులు తెచ్చిన ధాన్యానికి తేమశాతం అధికంగా ఉందనే సాకు చెప్పి కొనడం లేదు. అయితే ప్రభుత్వం మాత్రం కొంత తేమశాతం ఎక్కువగా ఉన్నా ధాన్యం తీసుకోవాలని, ప్రకటించిన మద్దతు ధర రూ. 1740 ఇవ్వాలని ఆదేశించింది. కానీ అధికారులు ఇదేదీ పట్టించుకోవడం లేదు. జిల్లా జేసీకి ఇవన్నీ తెలిసినా కొంతవరకు మెతగ్గా ఉండడంతో అధికారులు మాట వినడం లేదు. అయితే సేకరిస్తామని చెబుతున్న ధాన్యం లక్ష్యాన్ని అధికారులు అసలు పూర్తి చేస్తారా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. అయితే ఇదంతా తెర వెనుక మిల్లర్లకు మేలు చేయడానికేనన్న వాదన వినిపిస్తోంది.

కొనాల్సింది మేమే..

జిల్లాలో రబీ ధాన్యం సేకరణ ప్రభుత్వం తరఫున అధికారులు సరిగ్గా చేయకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అటు మిల్లర్లు, ఇతర వ్యాపారులు దీన్ని అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వం తరఫున మద్దతు ధర రూ.1,740 చెల్లించడం కష్టమని, ధాన్యం కూడా కొనుగోలు చేయడానికి ముప్పుతిప్పలు పెడతారంటూ ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సన్నాలరకం ధాన్యాన్ని వ్యాపారులు 75 కిలోల బస్తా రూ.1,900కు కొనుగోలు చేయగా, ఇప్పుడు అదే సన్నాలను రూ.1,200కు కొనుగోలు చేస్తున్నారు. నెలల వ్యవధిలోనే బస్తాకు రూ.700 కోత కోసేశారు.



చెల్లూరు రైతు సేవా కేంద్రం వద్ద రెండు రోజుల కిందట నిరసన తెలుపుతున్న అన్నదాతలు

ధాన్యం కొనాలని చెల్లూరు రైతుల నిరసన

రాయవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో ముమ్మరంగా వరి కోతలు చేపట్టిన రైతులకు ధాన్యం అమ్మకాల్లో కష్టాలు తప్పడం లేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని 12 గ్రామాల్లో 14,101 ఎకరాల్లో వరిసాగు చేయగా, ప్రస్తుతం ముమ్మరంగా వరికోతలు సాగుతున్నాయి. ఇప్పటివరకు సుమారుగా 30 శాతం కోతలు పూర్తయ్యాయి. ఈ మండలానికి సంబంధించి 12 గ్రామాల్లో 55 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కానీ పండించిన ధాన్యంలో 33 శాతం కొనుగోలు మాత్రమే ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించడంతో రైతులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో తాము పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని చెల్లూరు గ్రామానికి చెందిన రైతులు రైతు సేవా కేంద్రం వద్ద ఈనెల 21న నిరసన వ్యక్తంచేశారు. సీఎంఆర్ ద్వారా బ్యాంక్ గ్యారంటీ సమర్పించడంతో మంగళవారం నుంచి కొనుగోలు ముమ్మరం చేసినట్టు చెబుతున్నారు.

'తూర్పుగోదావరి'లో ధాన్యం కొనుగోలుకు కొత్త చిక్కులు

- టార్గెట్ పూర్తయిందంటున్న అధికారులు
- వరి కోతలే ఇంకా పూర్తి కాలేదంటున్న రైతులు
- ఇంత ధరకు కొనలేమంటూ చేతులెత్తేసిన మిల్లర్లు
- విదేశాల్లో బియ్యం ధరలు తగ్గిపోయాయట
- జిల్లాలో 5.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా
- లక్ష్యం 2.5లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటికి 1.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- మిగిలిన దాని సంగతేంటో?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు కొత్త చిక్కులొచ్చిపడ్డాయి. జిల్లాలో 58,586 హెక్టార్లలో వరిపంట సాగు చేశారు. ఈ సీజన్‌లో పంట బాగుండడంతో మొత్తం 5 లక్షల 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకూ ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. కానీ ప్రభుత్వ కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం సాధారణరకం క్వింటాల్ ధాన్యం ధర రూ.2300, గ్రేడ్-ఏ రకం ధాన్యం ధర రూ.2320కు కొనుగోలు చేస్తున్నారు. 75 కిలోల బస్తా ధాన్యం రూ.1720 నుంచి 1730 వరకూ కొనుగోలు చేస్తున్నారు. పైగా ధాన్యం అమ్మిన 48 గంటలలోపు తమ ఖాతాల్లో డబ్బు పడుతుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. కానీ బయట మార్కెట్‌లో అయినకాడికి అడుగుతున్నారు. దీనితో రైతులంతా గతంలో ఎన్నడూ లేని విధంగా మొత్తం ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తుండడం గమనార్హం. సాధారణంగా ప్రతీ ఏటా జిల్లాలో పండిన ధాన్యంలో సగం లేదా, అంతకంటే కొంత తక్కువ ధాన్యాన్ని ప్రభుత్వం కొంటుంది. మిగతా ధాన్యాన్ని రైతులు బయట మార్కెట్‌లో అమ్ముకుంటారు. ధాన్యం కమీషన్‌దారులు, మిల్లర్లు కొనుగోలు చేస్తుంటారు. కానీ ఈసారి విదేశాల్లో బియ్యం ధరలు బాగా తగ్గిపోయాయని కారణం చెబుతూ మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదు. లేదా బాగా తక్కువకు అడుగుతున్నారు. క్వింటాల్‌కు రూ.300 వరకూ తగ్గిస్తేనే తాము కొనగలమని తెగేసి చెబుతున్నారు. దీనితో మొత్తం రైతులంతా ప్రభుత్వం వైపు చూస్తున్నారు. కేరళలో ప్రతీ ఏటా కొనే బొండాలు కూడా కొనడం లేదని, విదేశాల్లోనూ డిమాండ్ లేదని మిల్లర్లు ప్రచారం చేస్తున్నారు. కానీ స్థానికంగా బియ్యం ధరలు మాత్రం తగ్గకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో పూర్తి ధాన్యం కొనుగోలు చేయకపోతే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకూ సుమారు 48.3 శాతం కోతలు జరిగాయి. అంటే సుమారు సగం కూడా జరగనట్టే. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ధాన్యం సేకరణ పూర్తయిందని అధికారులు చెబుతుంటే, మొత్తం కోతలు పూర్తయ్యాక వచ్చిన ధాన్యాన్ని ఎవరు కొంటారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తాం : జేసీ

అయితే రైతుల నుంచి వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు తమ పాత లక్ష్యాలను సవరిస్తున్నారు. ఈ సీజన్‌లో తాము 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 1,45,657 మెట్రిక్ టన్నులు సేకరించి, రైతులకు రూ.176 కోట్ల 32 లక్షలు ఇచ్చామని తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ప్రకటించారు. రైతులకు వాట్సాప్ యాప్ ద్వారా షెడ్యూలింగ్ చేసుకునే అవకాశం కల్పించామని, అంతేకాక తమ ధాన్యం తేమ శాతాన్ని బ్లూటూత్ ఫంక్షనాలిటీ ద్వారా మొబైల్ ఫోన్లకు మెసేజ్ రూపంలో పంపే సదుపాయం కూడా కల్పించామన్నారు. రైతులను అమ్మిన ధాన్యానికి సొమ్ము 24 గంటల నుంచి 48 గంటలోపే వారి బ్యాంక్ ఖాతాల్లో జమవుతుందని చెప్పారు. ప్రభుత్వానికి ధాన్యం విక్రయించిన రైతులంతా సంతృప్తిగా ఉన్నారని, ఎవరికైనా సందేహాలుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోలు రూమ్‌లోని 8309487151 నంబర్‌ను సంప్రదించాలన్నారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకూ ఇది అందుబాటులో ఉంటుందని చెప్పారు.



చక్కా స్నేహిత్ దొమ్మేటి వినయ్

'సివిల్స్'లో.. మనవాళ్లు

మెరిసిన 'తూర్పు' తేజాలు

- పిఠాపురానికి చెందిన చక్కా స్నేహిత్‌కు 94వ ర్యాంకు
- తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన దొమ్మేటి వినయ్‌కు 274వ ర్యాంకు

మెయిన్స్‌లో..

సివిల్స్ సర్వీసెస్ పరీక్షల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ కనబర్చారు. కాకినాడ జిల్లా పిఠా పురానికి చెందిన చక్కా స్నేహిత్ సివిల్స్‌లో మేథమెటిక్స్‌ను ఆప్షనల్ సబ్జెక్టుగా తీసుకుని రాయగా మొదటి ప్రయత్నంలోనే 94వ ర్యాంకు సాధించారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు చెంది న దొమ్మేటి వినయ్ మూడో ప్రయత్నంలో 274వ ర్యాంకు సాధించారు. వీరికి అత్యుత్తమ ర్యాంకులు రావడంపట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తుండగా పలువురు అభినందించారు.

పాఠశాలలకు రేపటి నుంచి వేసవి సెలవులు

జూన్ 12న పునఃప్రారంభం

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):ఈ విద్యాసంవత్సరం బుధవారంతో ముగుస్తోంది. అన్ని పాఠశాలలకు గురువారం నుంచి జూన్ 11 వరకూ వేసవి సెలవులు. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి.జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఇది వర్తిస్తుందని, ఏదొక సాకుతో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

నేడు 'దిశ' సమావేశం

అమలాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖల పరిధిలోని కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించేందుకు జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో నిర్వహించనున్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి జిల్లా అధికారులు వారి శాఖల పూర్తి సమాచారం ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. రాజకీయ ప్రతినిధులతోపాటు జిల్లా అధికారులు పథకాల అభివృద్ధిపై సమీక్షతోపాటు అధ్యక్షుడి హోదాలో ఎంపీ ప్రతిపాదించే అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ గడువు 25 వరకు పొడిగింపు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లించేందుకు గడువును ఈనెల 25వరకు పొడిగించినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యామండలి తొలుత ఈనెల 22 వరకు గడువు ఇచ్చిందన్నారు. 25 వరకు పరీక్ష తప్పినవారు, ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఇంప్రూవ్‌మెంట్ రాయదలుచుకున్నవారు పరీక్ష ఫీజు చెల్లించవచ్చునన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కూడా 25వ తేదీని తుదిగా నిర్ణయిస్తూ ఇకపై గడువును పొడిగించే అవకాశం లేదని తెలిపారు.

ఫలితాలు 'పది'లమేనా

- పదో తరగతి విద్యార్థుల భవితవ్యం తేలేది నేడే
- మనమిత్ర వాట్సాప్ నెంబరు, లీప్ యాప్, అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారా మార్కులు చేసుకునే అవకాశం

అమలాపురం రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షా ఫలితాలు బుధవారం విడుదల చేయనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ప్రకటించారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించినందున ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్న ఆశాభావాన్ని ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. విద్యార్థులు మనమిత్ర వాట్సాప్ నెంబరు నుంచి లీప్ యాప్ లేదా అధికారిక వెబ్‌సైట్ నుంచి మార్కులను చెక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు.

మనమిత్ర వాట్సాప్‌లో ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన మనమిత్ర వాట్సాప్ నెంబరు నుంచి ఫలితాలను సులభంగా తెలుసుకోవచ్చు. సెల్‌ఫోన్‌లో 955230000 నెంబరును సేవ్ చేసుకుని హాయ్ అని సందేశం పంపితే అక్కడ కొన్ని ఆప్షన్లు వస్తాయి. అందులో విద్యా సేవలు ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత పది ఫలితాలపై క్లిక్ చేస్తే అక్కడ రోల్ నెంబరు, డేట్ ఆఫ్ బర్త్ నమోదు చేస్తే వెంటనే ఫలితాలు పీడీఎఫ్ రూపంలో వస్తాయి. ఇటీవల ఇంటర్ రిజల్ట్స్ కూడా ఇదేవిధంగా విడుదల చేశారు. దీంతోపాటు పాఠశాల విద్యాశాఖ ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన లీప్ యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని స్టూడెంట్, తల్లిదండ్రుల లాగిన్‌లో ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యాప్‌లో లాగిన్ అయి పాఠశాలలను మొత్తం విద్యార్థుల ఫలితాలను చూసుకునే సదుపాయం కల్పించారు. పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌ను వినియోగించుకోవచ్చు. ఇటీవల నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లానుంచి 19,217మంది హాజరు కాగా వారి భవితవ్యం నేడు తేలనుంది.

ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల సహకారం అవసరం: డీఆర్వో


అమలాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి అన్నారు. డీఆర్వో చాంబర్‌లో జిల్లాస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో అధ్యక్షతన నెలవారీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పరిగణించే ఎన్నికలను ప్రభుత్వ జోక్యం లేకుండా స్వేచ్ఛగా నిర్వహించేందుకు రాజ్యాంగం స్వయం ప్రతిపత్తి గల కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు తీసుకువస్తున్న సంస్కరణలు, నిబంధనలను రాజకీయ పార్టీలకు తెలియచేసేందుకు ప్రతినెల సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్ల జాబితాలో లోపాలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకువస్తే సరిచేస్తామన్నారు. ఈనెల 1వతేదీ నాటికి 18ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. మీ సేవా కేంద్రాలతోపాటు వినియోగదారుల సేవా కేంద్రాలు, చరవాణుల్లో ఓటుహక్కు నమోదు చేసుకోవచ్చునన్నారు. ఓటరు నమోదులో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో దూరి రాజేష్(బీజేపీ), వడ్డి నాగేశ్వరరావు(కాంగ్రెస్), భవానీ (బీఎస్పీ), డిప్యూటీ తహశీల్దార్ శివరాజ్, జూనియర్ అసిస్టెంట్ సాయిరామ్ పాల్గొన్నారు.



పుస్తకం.. మంచి నేస్తం..

మానవాళికి ఆలోచించడం నేర్పింది అక్షరమైతే... ప్రపంచ గతిని మార్చేలా చేసింది పుస్తకం. అనుభవం, జ్ఞానంలను ఓ తరం నుంచి మరో తరానికి అందించే ఏకైక సాధనం పుస్తకమే. తరతరాలుగా పుస్తకాలు ప్రపంచానికి చేసిన సేవలను అంచనా వేయడమంటే ఆకాశాన్ని కొలవడం లాంటిదే.

- ప్రపంచానికి దిక్సూచి
- పుస్తకం హస్తభూషణం కావాలి
- నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం



(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

పుస్తకాలకు, రచయితలకు గౌరవం ఇవ్వడం

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు వేర్వేరు తేదీల్లో పుస్తక మహోత్సవాలు నిర్వహించేవి. 1616 ఏప్రిల్ 23న విలియం షేక్స్పియర్, సెర్వాంటెజ్ ఒకేరోజున మరణించడం, మరికొందరు ప్రముఖ రచయితలు అదేరోజున జన్మించడాన్ని ప్రామాణికంగా తీసుకుని యునెస్కో 1995లో ప్యారిస్‌లో జరిగిన సమావేశంలో పుస్తకాలకు, రచయితలకు గౌరవాన్ని ఇవ్వడం, యువతరాన్ని పుస్తక పఠనంవైపు ఆకర్షించడం, ప్రచురణ, కాపీ హక్కుల వంటి విషయాలను ప్రోత్సహించి వాటి గురించి విస్తృత ప్రచారం చేయడం వంటి లక్ష్యాలతో... ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవంగా, ప్రపంచ పుస్తక కాపీ హక్కుల దినంగా జరుపుకోవాలని పిలుపునిచ్చింది. యునెస్కో ప్రతి సంవత్సరం ప్రపంచంలోని ఒక ముఖ్య నగరాన్ని ప్రపంచ పుస్తక రాజధానిగా ప్రకటిస్తుంది.


ఒంటరితనంలో తోడు పుస్తకం. ఒక పుస్తకాన్ని చదవడం వల్ల ఎన్నో గొప్ప విషయాలను తెలుసుకోవచ్చును. అందుకే చిరిగిన చొక్కానైనా తొడుక్కుని ఒక మంచి పుస్తకం కొనుక్కోమన్నారు కందుకూరి వీరేశలింగంపంతులు. మంచి పుస్తకం వేలాది మంది స్నేహితులతో సమానం అన్నారు మరో మహానుభావుడు.

పుస్తకాలు చదవడం వలన జ్ఞానాన్ని సంపాదించడమే కాకుండా మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది. మహానుభావుల విజయగాథలు, ఆత్మ కథలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి. పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సంపాదించి ఎందరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. అందమైన అక్షరాలు, పదాల పలకరింపుతో పాఠకుడిని తనలో లీనం చేసుకుంటుంది పుస్తకం. ఇక విజ్ఞానాన్ని అందించే భాండాగారం పుస్తకం. అందువల్ల అందరూ కనీసం రోజుకు ఒక పుస్తకమైనా చదవాలని చెప్తుంటారు పెద్దలు.

ఆనాడు పుస్తకాలున్నా డబ్బులు లేవు

ప్రస్తుతం పుస్తకాలు చదవడానికి ఎవరూ ఆసక్తి చూపట్లేదు. గతానికి, ప్రస్తుతానికి చాలా తేడా ఉంది. గతంలో చాలా పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉండేవి. కానీ చదువుకోవాలని ఆశ ఉన్నవారికి మాత్రం డబ్బులు ఉండేవి కాదు. ఉదాహరణకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు పుస్తకాలంటే చాలా ఇష్టం. కానీ కొనుక్కోవడానికి ఆయన దగ్గర డబ్బులు ఉండేవి కాదు. అందువల్ల ఆయన ఒకరోజు లైబ్రరీలో ఉండి ఒక పుస్తకం చదువుకుని... దాన్ని తిరిగి ఇచ్చి మరొక పుస్తకం తెచ్చుకునేవారు.

ఈనాడు పుస్తకాలున్నా సమయం లేదు



ఈ తరం అంటే మన తరం కోసం చెప్పడానికి ఏముంది. సగం జీవితం పుస్తకం అయితే ఇంకో సగం జీవితం ఇంటర్నెట్‌లో గడపడానికే సమయం కుదరట్లేదు. ఇప్పటి పిల్లలకు పుస్తకాలంటే విసుగు. ఎప్పుడూ సోషల్ మీడియా ఉంటూ కాలం గడుపుతున్నారు. రానున్న కాలంలో పుస్తకాలను మ్యూజియంలో పెట్టుకుని చూడడం తప్పితే చదవడానికి ఆసక్తి చూపించే వారు ఉండరేమో అంటున్నారు కొందరు. అందువలన పుస్తకాన్ని చదవడం మర్చిపోకుండా ఉండడానికి పుస్తక పఠనాన్ని తల్లిదండ్రులు, పెద్దలు బాధ్యతగా స్వీకరించి పిల్లలతో చిన్నప్పటి నుంచి చదివించాలి.



స్నేహపూర్వకమైన సలహాలను ఇచ్చి మనల్ని మనం గౌరవించుకోవడం, పరులను గౌరవించడాన్ని పుస్తకాలు నేర్పుతాయి. మన హృదయాన్ని, మేథస్సును మనిషి పట్ల, ప్రపంచ పట్ల ప్రేమతో నింపివేస్తాయి. అందుకే పుస్తకం హస్తభూషణం కావాలి.



పుస్తక ప్రదర్శనలు అవసరం

పుస్తక ప్రదర్శనలు, రచయితల సందర్శనలు, పఠన సవాళ్లు వంటి పఠనాన్ని ప్రోత్సహించడానికి అనేక దేశాల్లోని పాఠశాలలు, గ్రంథాలయాలు కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ప్రచురణకర్తలు, పుస్తక విక్రేతలు పుస్తక కొనుగోళ్లను ప్రోత్సహించడానికి డిస్కౌంట్లు, పుస్తక బహుమతులను అందిస్తారు. అయితే ఉచిత పుస్తకం కోసం పిల్లలకు పుస్తక టోకెన్లను పంపిణీ చేస్తారు. పాఠశాలల విద్యార్థులు తమకు ఇష్టమైన పుస్తక పాత్రల వలే దుస్తులు ధరించి పుస్తక మార్చిడిని నిర్వహించమని ప్రోత్సహిస్తాయి. ప్రస్తుత కాలంలో పాఠ్యపుస్తకంపై ఆసక్తిని పెంచడానికి ఇటువంటి ప్రదర్శనలు చాలా అవసరం.



ఎర్ర చక్కరకేళి గెల రూ.700

- కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో సాగు
- అరటి మార్కెట్‌లో ఆశాజనకంగా ధర
- ఎర్రచక్కరకేళి అరటి పంటపై రైతుల ఆసక్తి
- కోనసీమ టు చెన్నై ఎగుమతులు
- లాభాల బాటలో అరటి రైతులు

కోనసీమ జిల్లాలోని కొత్తపేట నియోజకవర్గంలో సాగయ్యే ఎర్ర చక్కరకేళి రైతులకు లాభాలు పండిస్తోంది. మార్కెట్‌లో గెల ఒక్కటి రూ.700 పలుకుతోంది. ఇక్కడ పండే గెలలకు తమిళనాడులో విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో ఇక్కడి నుంచి అక్కడికి భారీగా ఎగుమతులు జరుగుతున్నాయి.

ఆత్రేయపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎంతో అందంగా కనిపించే ఈ ఎర్ర చక్కరకేళి అరటి పంటపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కోనసీమ ప్రాంతంలోని కొత్తపేట నియోజకవర్గంలో ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట మండలాల్లోని గ్రామాలు ఈ సాగు ఎక్కువగా చేపడుతున్నారు. ఈ అరటి గెలలు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకు ప్రతిరోజూ వ్యాన్లలో తరలిస్తున్నారు. అక్కడ కోల్డ్ స్టోరేజీలో అరటిని నిల్వ చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు.

ఎకరాకు రూ.3 లక్షలు పెట్టుబడి

ఆత్రేయపురం మండలంలోని ఉచ్చిలి, వద్దిపర్రు తదితర గ్రామాల్లో రైతులు ఎర్ర చక్కరకేళి సాగును చేపడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్న ఈ పంట సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎకరాకు రూ.3లక్షలు పెట్టుబడి అవుతోంది. సారవంతమైన భూమి అయితే దిగుబడి బాగా వస్తోంది. తద్వారా రైతు లాభాలను ఆర్జిస్తున్నారు. కౌలు రైతులు సైతం ఈ పంట వేయడానికి సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం అరటి మార్కెట్‌లో ఒక గెల రూ.700 ధర పలుకుతోంది.

చెన్నైకు ఎగుమతులు

ఎర్రచక్కరకేళి పంట పక్వానికి రాగానే రైతులు తమిళనాడు మార్కెట్‌కు తరలిస్తున్నారు. అరటి గెలను అత్తాలుగా కోసి శుభ్రంగా కడిగి పేపర్‌తో ట్రేల్‌లో అమరుస్తున్నారు. వాటిని వ్యానుల్లో లోడింగ్ చేసి తమిళనాడుకు ఎగుమతి చేస్తున్నారు. అక్కడ కూడా వెంటనే అరటిలోడును కోల్డ్ స్టోరేజీలో భద్రపరుస్తారు. అనంతరం మార్కెట్‌కు తరలిస్తారు. అక్కడ కిలో రూ.50 నుంచి రూ.70 వరకూ ధర పలుకుతోంది. తమిళనాడులోని చెన్నై, కోయింబత్తూర్, సేలం, రాయవెల్లూరు, తురిచ్చి నగరాల్లో ఎర్రచక్కరకేళికి విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో అక్కడ వాటి అమ్మకాలు విరివిగా సాగుతున్నాయి.



ఎర్రచక్కరకేళి అరటి పండ్లను నీటితో శుభ్రం చేస్తున్న రైతులు

భూమిపై జీవ వైవిధ్య వనరులు

- ఆదాయపు పన్నుశాఖ అడిషనల్ కమిషనర్ మోహన్‌బాబు
- ఘనంగా నన్నయ వర్సిటీ ఆవిర్భావ వేడుకలు, ధరిత్రి దినోత్సవం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన దృశ్యం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వాతావరణ నియంత్రణను, జీవ వైవిధ్యాన్ని, అవసరమైన వనరులను భూమి మనకు అందిస్తోందని ఆదాయపు పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ ఎం.మోహనబాబు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 19వ ఆవిర్భావ వేడుకలు, ధరిత్రి దినోత్సవాన్ని మంగళవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోహన్‌బాబు మాట్లాడుతూ వాతావరణ మార్పు, అటవీ నిర్మూలన, కాలుష్యం జీవవైవిధ్య నష్టానికి దారితీశాయన్నారు. ఏటా 2.01 బిలియన్ టన్నుల మున్సిపల్ ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని, 13 మిలియన్ హెక్టార్ల అటవీ ప్రాంతం పోతోందని తెలిపారు. మానవ కార్యకలాపాల వల్ల ఒక మిలియన్ జాతులు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. మానవులంతా పర్యావరణ హితంగా జీవించాలని కోరారు.

నిరంతర పర్యవేక్షణ: వీసీ

వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని శక్తివంతమైన విద్యార్థి కేంద్రీకృత విజ్ఞాన కేంద్రంగా మార్చుతామన్నారు. అన్ని అనుబంధ కళాశాలలు, పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. భవిష్యత్‌లో విశ్వవిద్యాలయం ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ తనిఖీల ద్వారా కళాశాలల విద్యా పనితీరు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తామన్నారు. కళాశాల ఉత్తమ అభ్యాసాలను ప్రశంసిస్తామని, ఏమైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. మోడల్ మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీగా ఎదగాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సిబ్బందికి నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. తొలుత ధరిత్రి దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'లో సన్‌డయల్

నన్నయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఫిజిక్స్ విభాగం విద్యార్థులు సూర్యుడి గమనం ద్వారా సమయాన్ని తెలిపే సన్ డయల్‌ను నిర్మించారు. దీనిని వీసీ ప్రసన్నశ్రీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలల్లో తొలిసారి సన్‌డయల్‌ను నన్నయ వర్సిటీలోనే ఏర్పాటు చేశామన్నారు. ఇది ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకూ సమయాన్ని సూచిస్తుందని చెప్పారు. అన్నవరం, ద్రాక్షారామల్లో ఇది ఉందని చెప్పారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రత్యామ్నాయ ప్లాట్ల కేటాయింపునకు చర్యలు

- ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి
- వేములపల్లి, జేగురుపాడు పార్కు పారిశ్రామికవేత్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ మేనేజర్ రమణారెడ్డి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) వేములపల్లి, జేగురపాడు పార్కుల్లో ప్లాట్లు కోల్పోయిన పారిశ్రామికవేత్తలకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయింపునకు వీలుగా ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్టు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి తెలిపారు. మంగళవారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణ్యపేట ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో జేగురపాడు, వేములపల్లిలకు చెందిన 106 మంది పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలో వేములపల్లి, జేగురుపాడులో పారిశ్రామిక అవసరాల కోసం 2018 నుంచి 2020 వరకు 197మంది పారిశ్రామికవేత్తలకు స్థలం కేటాయించడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో పేదలందరికీ ఇల్లు పథకం కింద పారిశ్రామిక వేత్తలకు కేటాయించిన స్థలాన్ని వెనక్కి తీసుకోవడం జరిగిందన్నారు. ఆ సమయంలో అప్పటి జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు అవసరమైన స్థలాన్ని కేటాయించడం జరుగుతుందని హామీ ఇచ్చారన్నారు. 197 మందిలో 124 మంది భూమికి చెల్లించిన రుసుంనివెనక్కి తీసుకోవడం జరిగిందని, 73 మంది డబ్బులు వెనక్కి తీసుకోలేదన్నారు. తమకు భూమి కేటాయించాలని అనేక పర్యాయాలు ఏపీఐఐసీ కార్యాలయం చుట్టూ తిరగడం, వీళ్ల డిమాండ్‌ని హెడ్ ఆఫీస్ మంగళగిరికి పంపడం జరిగిందన్నారు. పారిశ్రామికవేత్తల పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా కాలవచర్లలో సేకరించిన భూమిలో ప్లాట్లు కేటాయింపు కోసం సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా భూమి కేటాయింపు, ప్లాట్లు విభజన, ప్రభుత్వం నిర్దేశించిన ధర, షెడ్యూలు కులం, షెడ్యూలు తెగ, వెనుకబడిన వర్గాలు, ఇతర వర్గాలకు గతంలో కేటాయించిన విధంగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి జరిపే కేటాయింపులపై అవగాహన కల్పించారు. సమావేశంలో వచ్చిన పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు, భూముల కేటాయింపుపై నివేదిక తయారు చేసి మంగళగిరిలోని ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయానికి పంపుతామన్నారు.

ఎంపీ పురందేశ్వరి పూజలు

నిడదవోలు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆపై లెప్రసీ కాలనీలో పండ్లు పంచారు.

'రాజమహేంద్రవరం చరిత్ర-సంస్కృతి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన రచయిత్రి సుభద్రాదేవి

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): చారిత్రక, సాంస్కృతిక, విప్లవ ఉద్యమాలకు రాజమహేంద్రవరం ఓ ప్రతిబింబమని ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి అన్నారు. మంగళవారం స్థానిక వైష్ణవి రెసిడెన్సీలో రచయిత తేతలి గుర్రెడ్డి రాసిన రాజమహేంద్రవరం చరిత్ర-సంస్కృతి పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుభద్రాదేవి మాట్లాడుతూ అనేకమంది కవులకు, రచయితలకు, పరిశోధకులకు రాజమహేంద్రవరం కార్యక్షేత్రంగాను, కావ్యక్షేత్రంగాను, వెలుగొందిందని కొనియాడారు. చారిత్రక వారసంపద రాజమహేంద్రవరం నగరానికి తరగని ఆస్తి అని అన్నారు. రచయిత గుర్రెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరంపై మక్కువతోనే తాను పరిశోధన చేశానని తెలిపారు. ఈ సందర్భంగా గుర్రెడ్డిని సుభద్రాదేవి సత్కరించారు. కార్యక్రమంలో మాదేటి రవిప్రకాష్, కాలెపు గణేష్, శీలా త్రినాథస్వామి, ఉష, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

సినీ హాస్య నటుడు అనంత్



వెదురుపాకలో దుర్గాదేవి గురుప్రదక్షిణను ప్రారంభిస్తున్న అనంత్

రాయవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనలోనే మానసిక ప్రశాంతత, మానసిక పరివర్తన లభిస్తుందని సినీ హాస్య నటుడు పుణ్యమంతుల అనంత్ అన్నారు. మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం వెదురుపాక విజయదుర్గా పీఠం వద్ద మంగళవారం ఉదయం విజయదుర్గా పీఠంతో పాటు మూల పీఠం చుట్టూ ఉన్న నాలుగు వీధుల్లో అమ్మవారి గురు ప్రదక్షిణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంత్ మాట్లాడుతూ విజయదుర్గా పీఠంతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దైవారాధన చేయడంతో పాటు ధర్మబద్ధమైన జీవనం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాలుగు వీధుల్లో జరిగిన దేవి గురు ప్రదక్షిణలో పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్: పీడీజే



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 10న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో ఈ మేరకు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ ఇన్చార్జి కార్యదర్శి బి.పద్మ, పీడీజే మంగళవారం సమావేశం నిర్వహించారు. రాజీకి అర్హమైన అన్ని కేసులను గుర్తించి ఆ జాబితాను డీఎల్‌ఎస్‌ఏకు అందజేయాలని వారు సూచించారు. సమావేశంలో డీఆర్వో టి.సీతారామయ్య, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బీఎస్‌ఎం వలీ తదితరులు పాల్గొన్నారు.

27 వరకు డెల్టా కాలువలకు నీటి విడుదల

ధవళేశ్వరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): శివారు ఆయకట్టు రైతాంగం సాగునీటి అవసరాలతో పాటు గ్రామాల్లో చెరువులు నింపుకోవడానికి వీలుగా డెల్టా కాలువలకు నీటి విడుదలను ఈ నెల 27వ తేదీ వరకు పొడిగించారు. ఈ నెల 16న కాల్వల మూసివేతకు ఇరిగేషన్ ఎస్ఈ ఆదేశాలు జారీ చేయగా గోదావరి, కోనసీమ జిల్లాల రైతుల డిమాండ్, ప్రజా ప్రతినిధుల సూచన మేరకు ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో వారం రోజుల పాటు నీటిని విడుదల చేసి 22 నుంచి డెల్టా కాలువలను మూసివేయనున్నట్టు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ గోపీనాథ్ ప్రకటించారు. అయితే శివారు ఆయకట్టు రైతుల సాగునీటి డిమాండ్, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చెరువులు నింపుకోవడానికి వీలుగా ఈ నెల 27 వరకు మూడు డెల్టా కాలువలకు నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. కాగా మంగళవారం తూర్పుడెల్టాకు 900క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1000క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3వేల క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.40 అడుగులుగా నమోదైంది.

మద్యం తాగి కారు నడిపినందుకు తమిళనాడు వాసికి రూ.11 వేలు జరిమానా

కొవ్వూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి కారు నడిపిన వ్యక్తికి రూ.11 వేలు జరిమానా విధించినట్టు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఈ నెల 21న గామన్ వంతెన టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వస్తున్న తమిళనాడులోని కుడలోర్ జిల్లా వన్నరపాలయం గోరి న్యూ స్ట్రీట్‌కు చెందిన రమచంద్రన్ దేవనాథ్ మద్యం తాగి కారును నిర్లక్ష్యంగా నడుపుతుండడంతో బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 137.7ఎంజీ ఆల్కహాల్ శాతం సూచించడంతో మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. దీంతో దేవనాథ్‌కు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రూ.11 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్టు సీఐ తెలిపారు.

చిత్రకారుడు వీర్రాజు స్మారక పురస్కారాల ప్రదానం



రాధారాణికి పురస్కారం ప్రదానం చేస్తున్న ఉండవల్లి

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బహుముఖ ప్రజ్ఞాశాలి, రచయిత, చిత్రకారుడు శీలా వీర్రాజు తరపున ఆయన కుటుంబీకులు రాజమండ్రి రుణం తీర్చుకుంటున్నారని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం సీపీ బ్రౌన్ మందిర నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి అధ్యక్షతన దామెర్ల ఆర్ట్ గ్యాలరీలో జరిగిన శీలా వీర్రాజు స్మారక పురస్కారాలను ప్రముఖ చిత్రకారులు పట్నాల రాధారాణి, తారా నగేష్‌లకు ఆయన ప్రదానం చేశారు. సన్నిధానం శాస్త్రి మాట్లాడుతూ 17వ శతాబ్ధిలోనే రాజమండ్రిలో చిత్ర కళ రాణించిందని చెప్పడానికి చారిత్రక ఆధారాలున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో వీర్రాజు సతీమణి సుభద్రాదేవి, రచయిత ఎస్ఆర్ పృథ్వీ, మాదేటి రవిప్రకాష్, శీలా పల్లవి, శీలా ఉష, కాలెపు గణేష్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవోకు మేమంటే చులకన!

- ఆయన వ్యవహారశైలిపై 90 శాతం ఉద్యోగుల వ్యతిరేకత
- ఈవో కుమారుడు పాలనా వ్యవహారాల్లో తలదూర్చడంపై సీరియస్
- అన్నవరం దేవస్థానం వివాదాలపై దేవదాయ అదనపు కమిషనర్ విచారణ



సమావేశానికి హాజరైన దేవస్థానం ఉద్యోగులు, వివరాలు సేకరిస్తున్న అదనపు కమిషనర్ చంద్రకుమార్

అన్నవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని అన్నవరం సత్యదేవుని ఆలయం ఇటీవల తరచూ వివాదాల్లో చిక్కుకుంటూ ప్రతిష్టను మసకబారుతుందనే ఫిర్యాదులతో దేవదాయ కమిషనర్ ఆదేశాలతో మంగళవారం అదనపు కమిషనర్ చంద్రకుమార్ విచారణ నిర్వహించారు. 90 శాతం ఉద్యోగులు ఈవో సుబ్బారావు వ్యవహారశైలిపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఈవో తమను చులకనగా చూస్తున్నారని ఆరోపించారు. చంద్రకుమార్ ముందుగా కుటుంబసభ్యులతో సత్యదేవుడిని దర్శించుకుని అనంతరం ఆలయ ఏఈవోలు, సూపరెంటెండెంట్లు, ఇంజనీరింగ్ అధికారులతో ప్రకాష్‌సదన్ సమావేశపు హాలులో సమావేశమయ్యారు. ముందుగా హాల్‌లో ఉన్న సీసీ కెమెరాలను ఆఫ్ చేయాలని చెప్పి విచారణ ప్రారంభించారు. ఇటీవల ఎందుకు ఆలయంలో వివాదాలు వస్తున్నాయని ప్రశ్నించారు. దీంతో హాలులో నిశ్శబ్ద వాతావరణం ఏర్పడింది. అనంతరం పరిస్థితిని ఒక సూపరింటెండెంట్, మరొక ఏఈవో ఈవో వ్యవహార శైలిపై ఏకరువు పెట్టారు. మరో ఏఈవో కలగజేసుకుని అందరి సమక్షంలో వివరాలు అడిగితే చెప్పలేరని తెలపడంతో ఎవరికి వారు లిఖితపూర్వకంగా రాయండి.. లేకుంటే ఒక్కొక్కరు వచ్చి వివరాలు అందించాలని చెప్పి పిలిచి వారి నుంచి వివరాలను చంద్రకుమార్ తీసుకోగా మరో అధికారి రికార్డు చేసుకున్నారు. సమావేశానికి హాజరైన ఉద్యోగుల్లో 90 శాతం మంది తమను ఈవో మానసికంగా కుంగదీయడమే కాకుండా చులకనగా చూస్తున్నారని, పాలనాపరమైన వ్యవహారాల్లో ఈవో కుమారుడు కలగజేసుకుని తమకు ఆదేశాలు ఇస్తున్నారని వాపోయారు. ఇటీవల వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులను ఎందుకు వీఆర్‌ఎస్ తీసుకుంటున్నారని ప్రశ్నించగా తమదైన శైలిలో వారు సమాధానమిచ్చారు. మరోక ఏఈవో దాదాపు 30ఏళ్లగా దేవదాయశాఖలో వివిధ ఆలయాల్లో వివిధ క్యాడర్లలో పనిచేశామని, అందరూ ఆదేశాలిచ్చి పనిచేయించుకునేవారని ఇక్కడ మాత్రమే పూచికపుల్లగా తీసిపారేస్తూ అందరి సమక్షంలో అవమానాలకు గురిచేశారని వివరించారు. అయితే విచారణ ప్రారంభానికి ముందే దేవదాయ కమిషనర్ కార్యాలయానికి కొన్ని ఆధారాలతో ఫిర్యాదులు అందించారు.

నేడు పోలవరం ప్రాజెక్ట్‌పై మంత్రి నిమ్మల సమీక్ష

అన్నవరం: రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం మధ్యాహ్నం అన్నవరం జాతీయ రహదారిపై ఉన్న ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో పోలవరం, ఇతర ప్రాజెక్ట్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి పోలవరం అధికారులు, ఇరిగేషన్ అధికారులు నివేదికలతో సిద్ధమవుతున్నారు. సమీక్ష అనంతరం ఆయన విజయవాడ వెళ్లనున్నారు.

'కరెంట్' ఇష్యూ!

ఎలక్ట్రికల్ బిల్ పేమెంట్ పేరుతో దోపిడీకి సైబర్ కేటుగాళ్ల వల

అప్రమత్తతతో బయటపడిన రైల్వే అధికారి


అధికారికి వచ్చిన వాట్సాప్ మెసేజ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ రైల్వే అధికారికి ఇటీవల 74704 38199 నెంబరు నుంచి ఒక వాట్సాప్ మెసేజ్ ఇంగ్లీషులో వచ్చింది. 'మీ గత నెల కరెంటు బిల్లు అప్‌డేట్ కాకపోవడం వల్ల ఈ రాత్రి 7.30 గంటల తర్వాత కరెంటు కనెక్షను కట్ చేస్తాం. వెంటనే ఈటీవో ఆఫీస్‌లో 7077003406, వాట్సాప్ 86109 32662 నెంబరులో సంప్రదించాలి' అని ఆ మెసేజ్ సారాంశం. సాధారణంగా ఆ అధికారి కరెంటు బిల్లును ప్రతి నెలా గడువుకు ముందే ఈపీడీసీఎల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించేస్తారు. దీంతో ఒక వేళ తన పేమెంటు అప్‌డేట్ కాలేదేమో, రాత్రికి కరెంటు కట్ చేసేస్తే ఎలా? అని కాస్త ఆందోళన చెందారు. వెంటనే ఆ మెసేజ్‌లో సూచించిన నెంబరుకు కాల్ చేయగా కాల్ వెయిటింగ్ వచ్చింది. కాల్ కలవనప్పుడు ఆటోమేటిగ్‌గా వచ్చే వాయిస్ కన్నడ భాషలో వచ్చింది. కొద్ది నిమిషాల తర్వాత అవతలి నుంచి ఈ అధికారికి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి ఇంగ్లీషులో మాట్లాడుతున్నారు. అప్పటికే అనుమానం కలిగిన అధికారి అప్రమత్తమయ్యారు. తెలుగులో మాట్లాడాలని చెప్పారు. దీంతో కాల్ కట్ అయ్యింది. సైబర్ నేరగాళ్ల వాట్సాప్ డీపీ కూడా ఓ బల్బు ఫొటో కింద ఎలక్ట్రిసిటీ బిల్ పే అని ఉంది. సైబర్ నేరగాళ్లు ప్రతిక్షణం రక రకాల మార్గాల ద్వారా ప్రజలను మోసం చేసి సొమ్ము దోచుకుందామని ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారనే విషయం ఈ ఘటన ద్వారా రూఢీ అవుతోంది. దీనికి అప్రమత్తతే ఆయుధం. తెలియని నెంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు, లింకులకు స్పందించకపోవడమే మన డబ్బుకు రక్ష అని అనడంలో సందేహం లేదు.

పుష్కరాల రేవు దారిలో శిశువు మృతదేహం



తాళ్లపూడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడిలో ప్రజలు పుణ్యస్నానాల కోసం పుష్కరాల రేవుకు వెళ్లే దారిలో ఆడ శిశువు మృతదేహం ఉండడంతో స్థానికుల ద్వారా విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు అందిన సమాచారం మేరకు కొవ్వూరు సీఐ విజయబాబు సిబ్బందితో ఆ ప్రాంతాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. స్థానిక ఆసుపత్రులో విచారణ చేయగా గోపాలపురం మండలం ప్రగడపల్లి గ్రామానికి చెందిన రాసపోతుల దేవి, శ్రీనివాస్ దంపతులు తాళ్లపూడిలో డెలీవరి నిమిత్తం వచ్చారని, అప్పటికే శిశువు గర్భంలోనే మృతి చెందిన విషయం దంపతులకు తెలిపి ఆపరేషన్ చేసి మృతదేహాన్ని ఆ దంపతులకు అందించామని, ఆ బిడ్డను తామే ఖననం చేసుకుంటామని తీసుకెళ్లిపోయారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఖననం చేసే ప్రదేశం తెలియక చేసిన పనిగా అధికారులు గుర్తించారు. కాగా సీఐ ఉత్తర్వుల మేరకు శిశువు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఏఎస్ఐ చక్రారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ముద్దయ్య పాల్గొన్నారు.

గోవులను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

రాయవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గోవులను అక్రమంగా పశువుల కబేళాకు తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. కాకినాడ జిల్లా జగ్గంపేట సంత నుంచి కోనసీమ జిల్లా ద్రాక్షారామకు గోవులను సోమవారం అర్ధరాత్రి వ్యాన్‌లో తరలిస్తున్న ద్రాక్షారామంకు చెందిన కనికెళ్ల వెంకన్న బాబు, రాయవరం మండలం మాచవరానికి చెందిన డ్రైవర్ కాకాడ శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు వ్యాన్‌లోని 7 గోవులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి వ్యాన్ సీజ్ చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.


గోవులను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసిన రాయవరం పోలీసులు

చేబ్రోలులో ప్రబలిన డయేరియా

» 4రోజుల్లో 100మందికి అస్వస్థత » పీహెచ్‌సీ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స » గోప్యంగా ఉంచుతున్న వైద్యాధికారులు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో డయేరియా ప్రబలింది. నాలుగు రోజుల్లో 100మందికి పైగా విరోచనాలతో బాధపడుతూ పీహెచ్‌సీ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరారు. అయితే ఈ విషయాన్ని వైద్యాధికారులు గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చేబ్రోలులో వాంతులు విరోచనాలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకి అధికమవుతోంది. గ్రామంలోని మట్ల వారి వీధి, రథంబాట, కొత్తపేట, చల్లా వారి వీధి తదితర ప్రాంతాల నుంచి సుమారు 100మంది గత 4 రోజుల్లో చికిత్స నిమిత్తం చేబ్రోలు పీహెచ్‌సీకి, ప్రవేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీల వద్దకు వచ్చారు. ఇవేగాక గొల్లప్రోలు, పిఠాపురం, కాకినాడలోని ప్రవేటు ఆసుపత్రుల్లోనూ చికిత్స పొందుతున్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలోనే 50మంది వరకూ రోగులు వాంతులు, విరోచనాలతో బాధపడుతూ చికిత్స పొందారు. అయితే ఈ విషయాన్ని వైద్యాధికారులు గోప్యంగా ఉంచారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జయకృష్ణ ప్రశ్నించగా 17 కేసులు మాత్రమే ఉన్నాయని చెప్పగా, గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు ప్రశ్నిస్తే 40 నుంచి 50 వరకూ కేసులు ఉంటాయని వైద్యాధికారి డాక్టర్ జగదీష్ చెప్పడం గమనార్హం. పీహెచ్‌సీ ఆవరణ అంతా అపరిశుభ్రంగా ఉండటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఉండేది ఇలాగేనా నిలదీశారు. వందమందికి పైగా డయేరియాతో చికిత్స పొందుతుంటే గ్రామంలో ఎందుకు వైద్యబృందాలు పర్యటించడంలేదని, ఉన్నతాధికారులకు ఎందుకు తెలియజేయలేదని ప్రశ్నించారు. వాతావరణంలో మార్పులు, తాగునీరు కలుషితం కావడం వంటివి డయేరియా ప్రబలడానికి కారణాలుగా చెబుతున్నారు. 4రోజులుగా భారీగా కేసులు వస్తున్నా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా కాకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.


చేబ్రోలులో చికిత్స పొందుతున్న బాధితులు


చేబ్రోలు పీహెచ్‌సీలో అపరిశుభ్ర పరిస్థితులు


వివరాలు అడుగుతున్న గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు

సీలేరు నదిలో గల్లంతైన ఇద్దరి యువకుల మృతదేహాలు లభ్యం


మృతదేహాలను బయటకు తీస్తున్న పోలీసులు

చింతూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సీలేరు నదిలో ఆదివారం గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. చింతూరుకు చెందిన నాగుల దిలీప్ (25), సుగ్రీయ శ్రీను (25) వారి స్నేహితులతో కలసి ఆదివారం కల్లేరు సీలేరు నది ఒడ్డుకు విహారయాత్రక వెళ్లి ప్రమాదవశాత్తు సీలేరు నది ఉధృతిలో కొట్టుకపోయారు. కాగా ఆ రోజు నుంచి రెవెన్యూ, పోలీసు శాఖలు గాలింపు చర్యలు చేపట్టాయి. చివరకు మంగళవారం నది ఉధృతిలో కొట్టుకపోతున్న మృతదేహాలను గుర్తించారు. వారి కుటుంబాలకు పోలీసులు అప్పగించారు. దీంతో మృతుల కుటుంబాల్లో విషాదం అలముకుంది. గాలింపును ఎస్ఐ రమేష్ పర్యవేక్షించారు. ఆయుర్వేద నిపుణుడు జమాల్ ఖాన్ సహాయ సహకారాలు అందించారు.

ఏలేరు కాలువలో యువకుడి గల్లంతు

రౌతులపూడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామశివారు ఏలేరు కాలువలో పడి గుమ్మరేగుల గ్రామానికి చెందిన వింటూరి జయబాబు (29) గల్లంతయ్యాడు. మంగళవారం మధ్యాహ్న సమయంలో వేరే ప్రాంతం నుంచి వస్తూ అలసట చెంది ముఖం కడుక్కోవడానికి కాలువలోకి దిగగా కాలు జారి పడి పోయి గల్లంతయ్యాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడి కోసం గాలింపు చేపట్టారు.

కూతురికి తాను కుదిర్చిన పెళ్లి చేయలేదని...

పురుగు మందు తాగి తండ్రి మృతి


మృతిచెందిన ధర్మారావు

పెరవలి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కూతురికి తాను కుదిర్చిన పెళ్లి చేయలేదని ఆవేదనతో తండ్రి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా ముక్కామలకు చెందిన కమాడి ధర్మారావు (40) తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూతురికి పెళ్లి చేయడానికి తెలిసిన అబ్బాయితో సంబంధం చూశాడు. కానీ ఈ సంబంధాన్ని అతడి భార్య, కుమార్తె వ్యతిరేకించారు. దీంతో తరచూ గొడవలు పడ్డారు. మనస్థాపం చెందిన ధర్మారావు ఈ నెల 20న పురుగు మందు తాగి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తణుకు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. సోమవారం రాత్రి మృతిచెందాడు. ధర్మారావు భార్య సావిత్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దయనీయంగా పునరావాస కేంద్రాలు

పోలవరం నిర్వాసితుల అధ్యయన కమిటీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్



సమావేశంలో మాట్లాడుతున్న మార్టిన్ లూథర్

చింతూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పోలవరం ముంపు నిర్వాసితుల కోసం ఏర్పాటు చేస్తున్న పునరావాస కేంద్రాలు దయనీయంగా ఉన్నాయని పోలవరం నిర్వాసితుల అధ్యయన కమిటీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్ ఆరోపించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకత్వాన నిర్వాసితుల కమిటీగా ఏర్పడి ముంపు మండలాల్లో సోమ, మంగళవారాలు చింతూరు డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మంగళవారం చింతూరులో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి తమ అధ్యయనంలో వెల్లడైన అంశాలను వివరించారు. మార్టిన్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాలు నాణ్యతాలోపంతో పాటు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఏ ఒక్క ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. పరిహారం చెల్లింపుల్లో స్పష్టత లేదన్నారు. ముంపు గ్రామాల లెక్కలన్నీ తప్పుల తడకగా ఉన్నాయన్నారు. వరద నీటికి ముంపునకు గురవుతున్న ప్రతి గ్రామానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దివంగత సీఎం రాజశేఖరరెడ్డి కలల ప్రాజెక్టు అయిన పోలవరం నిర్వాసితులకు ఇటు టీడీపీ, అటు వైసీపీ ప్రభుత్వాలు అన్యాయం చేశాయన్నారు. ముందుగా వాస్తవ ముంపుని తేల్చాలన్నారు. పరిహారం చెల్లించే రోజుకు 18ఏళ్ల నిండిన ప్రతిఒక్కరికీ పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల పక్షాన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నేతృత్వంలో నిలబడి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ఎస్ బుల్లిబాబు, రామలక్ష్మి, అహ్మద్ అలీ, హనీఫ్, కూనారపు నరేష్ తదితరులు ఉన్నారు.

మారేడుమిల్లిలో భారీ వర్షం

విరిగిపడ్డ వృక్షాలు


ఓ ఇంటిపై విరిగిపడ్డ భారీ వృక్షం

మారేడుమిల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లిలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలు చోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు సైతం విరిగిపడాయి. పలుచోట్ల ఇంటి పైకప్పులపై చెట్లు పడిపోవడంతో గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. తెగిపడ్డ విద్యుత్ వైర్లను తొలగించి స్తంభాలను సరిచేసి విద్యుత్ పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. అకాల వర్షంతో మామిడి, జీడిమామిడి రైతులకు చేతికి వచ్చిన పంట రాలిపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

గ్రామ బహిష్కరణపై ఫిర్యాదు


బహిష్కరణ నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్న బాధితులు

తాళ్లరేవు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు పంచాయతీ మాధవరాయునిపేట పెద్దలు తమను గ్రామ బహిష్కరణ చేశారని గంజా మహాలక్ష్మి కుటుంబం మంగళవారం తాళ్లరేవు తహశీల్దారు పి.త్రినాథరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిగా తమ కుటుంబాన్ని వెలివేసి శుభకార్యాలు, జీవనోపాధి పనులకు ఆటంకం కలిగిస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారని, గ్రామ బహిష్కరణ నుంచి విముక్తి కల్పించాలని కోరారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

విధుల పట్ల నిర్లక్ష్యమే కారణం

ఎటపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తరచూ పాఠశాలకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. ఎటపాక మండలం గన్నవరం ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న నక్కా వెంకట్రావు గత 3నెలలుగా పాఠశాలలో సొంతంగా వలంటీర్‌ను నియమించుకుని విధులకు గైర్హాజరవుతున్నాడు. ఎటువంటి ముందస్తు సమాచారాన్ని విద్యాశాఖాధికారికి తెలియపరచకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉండడంతో పలుమార్లు మండల విద్యాశాఖాధికారి హెచ్చరించినా అతడి వ్యవహారశైలి మార్చుకోకపోవడంతో మండల విద్యాశాఖాధికారి నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి పంపారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు అతడిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రావులపాలెం ఎంవీఐ శ్రీనివాస్‌కు 'ఉత్తమ' అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎంవీఐ శ్రీనివాస్

రావులపాలెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శ్రీనివాస్ ఉత్తమ రహదారి భద్రత పెర్‌ఫార్మర్ అవార్డు అందుకున్నారు. దేశవ్యాప్తంగా అసోసియేషన్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 2025 ఉత్తమ రహదారి భద్రతా పెర్‌ఫార్మర్ అవార్డు శ్రీనివాస్ అందుకున్నారు. మహారాష్ట్రలోని పూన్నైలో ఏఆర్ఏఐ డైరెక్టర్ నుంచి జాతీయ అవార్డు, రూ.10వేల నగదు బహుమతిని తీసుకున్నారు. శ్రీనివాస్ రోడ్డు భద్రతపై 11 లఘు చిత్రాలను చిత్రీకరించారు. సినీ ప్రేక్షకుల్లో అవగాహన కల్పించడానికి సినిమా థియేటర్లలో రహదారి భద్రత లఘుచిత్రాలను ప్రదర్శించారు. రహదారి భద్రత కార్యకలాపాల్లో చేసిన కృషికి మంత్రులు సైతం అభినందించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలమేరకు రాష్ట్ర లీగల్ అథారిటీ వారు ప్రజల్లో రహదారి భద్రత అవగాహన కోసం ఏర్పాటు చేసిన అధికారిక వెబ్‌సైటులో శ్రీనివాస్ నిర్మించిన హెల్మెట్ లఘుచిత్రాలను అప్‌లోడ్ చేశారు. పాఠశాలలో రోడ్డు భద్రత క్లబ్‌లను ప్రారంభించారు. నిర్భయ నిధి కింద ఉన్న అభయ ప్రాజెక్టులో మహిళలు, పిల్లలు, సురక్షిత రవాణా కోసం రాష్ట్రస్థాయి కమిటీ సభ్యులుగా పనిచేశారు. ఈసేవలకు గుర్తింపుగా ఆయనకు అవార్డులభించింది.



ఆలయం.. దేదీప్యమానం..

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం అరుణాచలేశ్వర ఆలయం, రమణాశ్రమ పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి. సూర్యాస్తమయం సమయంలో ఆలయం దేదీప్యమానంగా కనిపించింది. -ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

28న తుని మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికలు

తుని రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు మరోసారి ఎన్నికలు జరగనుంది. ఈనెల 28న ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మున్సిపల్ చైర్మన్ ఏలూరు సుధారాణి ఆ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యం అయింది. ఇప్పటికే వైస్ చైర్మన్ ఎన్నిక పెండింగ్లో ఉంది. ఈ నేపథ్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను ఒకేసారి నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతుంది. దీంతో ఈనెల 24న కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు తెలుస్తుంది.తునిలో మరోసారి ఉత్కంఠ వాతావరణం ఏర్పడింది.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

దేవరపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం బందపురంలో ఉపాధి హామీ పనికి వెళ్లిన కూలీ లపై తేనెటీగలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన సుంకర గంగరాజును తీవ్రంగా కుట్టడంతో దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మంగళవారం 30మంది కూలీలు ఉపాధి హామీ పనులు ముగించుకుని ఇంటికి తిరిగిస్తున్న క్రమంలో తేనెటీగలు దాడి చేయడంతో అందరూ పరుగులు తీశారు. వృద్ధుడైన గంగరాజును తేనెటీగలు చుట్టుముట్టి కుట్టడంతో దేవరపల్లి ప్రాథమిక చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి అనంతరం తన ఇంటికి పంపినట్టు ఏపీవో శ్రీనివాస్ తెలిపారు.

ఆయిల్‌పామ్, అరటితోట దగ్ధం

గోపాలపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం గ్రామ శివారు ఉప్పరగూడెం సమీపంలో ఉన్న ఆయిల్ పామ్, అరటితోట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గోపాలపురం గ్రామానికి చెందిన పీ.రాజేశ్‌రెడ్డికి చెందిన రెండు ఎకరాల్లో ఉన్న ఆయిల్‌పామ్, అరటి తోటల్లో మంగళవారం మధ్యాహ్నం దట్టమైన పొగ కమ్ముకోవడంతో స్థానికులు, రైతులు వెళ్లి చూడగా చెట్లు కాలిపోతున్నట్టు గమనించారు. రైతు జంగారెడ్డిగూడెం అగ్నిమాపక దళానికి సమాచారం ఇవ్వగా వారి మంటలు అదుపు చేసే సమయానికి చాలా వరకు చెట్లు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.2 లక్షలు ఆస్తినష్టం ఉంటుందని రైతుల తెలిపాడు. విద్యుత్‌తీగల కారణంగా సంఘటన జరిగినట్టు భావిస్తున్నారు.

ఎంత(డ) రిలీఫ్..

పెరుగుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు, యువకులు జలకాలాటల్లో మునిగితేలుతున్నారు. ఉక్కపోతను భరించలేక సమీప పంటకాలువలు, చెరువుల్లో ఈతకు దిగి గంటలతరబడి కేరింతలు కొడుతున్నారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం చింతపల్లిలాకు సమీపంలోని పంటకాలువలో యువకులు పెద్దఎత్తున స్నానాలు చేస్తూ ఇలా సరదాగా గడిపారు. కరప (ఆంధ్రజ్యోతి)



అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

మలికిపురం, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మలికిపురంలో ఎత్తువంతెన వద్ద అయ్యప్పస్వామి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రెండోరోజు మంగళవారం పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు తదితర అంశాలతో ప్రతిష్ఠకు అన్నీసిద్ధం చేశారు. అయ్యప్పస్వామి ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి హారం బహూకరణ

ముమ్మిడివరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంటావారి వీధిలోని సత్తెమ్మ తల్లి అమ్మవారికి ఒక భక్తుడురూ.15వేలు విలువైన వెండి హారం, గంధపు గిన్నెను కానుగా సమర్పించారు. యానాంకు చెందిన పెదపూడి శ్రీనివాసరావు-నాగకుమారి దంపతులు వీటిని మంగళవారం ఆలయ కమిటీకి అందజేశారు.

గుడిమెళ్లంక రిజర్వాయర్ సమస్యలు పరిష్కరిస్తా

రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో అత్యంత కీలకమైన గుడిమెళ్లంక రక్షిత మంచినీటి పథకం బాలరిష్టాలను వెంటనే పరిష్కరిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గుడిమెళ్లంక రిజర్వాయర్ వద్ద విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 98 హేబిటేషన్లకు ఈరిజర్వాయరు ద్వారా రోజూ 70లక్షల లీటర్ల తాగునీటిని అందిస్తున్నామన్నారు. ఈరిజర్వాయరుకు 510 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అవసరముందని, ప్రస్తుతం 350కేవీ విద్యుత్‌ను వాడుకుంటున్నారని, అదనంగా 160 కేవీ కోసం సమావేశం నుంచే విద్యుత్ ఎస్‌ఈ రాజబాబుతో మాట్లాడారు. 24గంటలు విద్యుత్ సరఫరా చేసే ప్రత్యేక లైన్ పనులు మూడు రోజుల్లో పూర్తి కానున్నట్టు ఆయన చెప్పారు. మలికిపురం నుంచి ప్రత్యేక లైన్ ద్వారా విద్యుత్‌ను అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే 26 కొత్త మంచినటి ట్యాంకులు నిర్మించామన్నారు. ఓఎన్జీసీ నుంచి రూ.5కోట్లు సీఎస్సార్ నిధుల నుంచి మంజూరు చేయమని అడిగామని, ఆ నిధులు మంజూరైతే మరో ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేస్తామని, ఇప్పటికే ఒక ఆర్ఎస్ఎఫ్, మైక్రో ఫిల్టర్ల ద్వారా నీరు అందిస్తున్నామనారు. వేసవిలో తాగునీటి ఇబ్బంది రాకుండా రిజర్వాయరులో ఏడు మీటర్ల నీటిని నిల్వ చేశామన్నారు. త్వరలో ఈ సమస్యలను అధిగమించి సక్రమంగా తాగునీరు అందడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జేజేఎం ద్వారా నియోజకవర్గంలో 60గ్రామాల్లో కుళాయిలు వేయాల్సి ఉండగా 28గ్రామాల్లో పూర్తయ్యాయని, 32గ్రామాల్లో వేయాల్సి ఉందన్నారు. త్వరలో రిజర్వాయరును కూడా ఆధునికీకరిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ రాజన్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి ఇబ్బంది రాకుండా చూస్తామన్నారు. గ్రామాల్లో పంచాయతీలు, తాగునీటి సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అక్రమ కనెక్షన్లు తీసి వేయడానికి పంచాయతీల ద్వారా నోటీసులిస్తామన్నారు. ఎలక్ట్రికల్ విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ గుడిమెళ్లంక రిజర్వాయరుకు విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి మరో 160 కేవీ విద్యుత్ సరఫరాకు ముందుకు వెళతామన్నారు. సమావేశంలో దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, చెల్లుబోయిన హెలీనలు పలు సమస్యలపై మాట్లాడారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, బాలాజీ, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, చెల్లింగి సత్యనారాయణ, రాపాక నవరత్నం, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

లేగదూడల అందాల పోటీలు



వన్నెచింతలపూడిలో లేగదూడల అందాల పోటీల్లో ఎమ్మెల్యే ఆనందరావు, అధికారులు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఏర్పాటుచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వన్నెచింతలపూడిలో పశువైద్యాధికారిణి డాక్టర్ పూర్ణిమా నాగలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన లేగదూడల అందాల పోటీని ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ నక్కా రాజారత్ననాగవాణి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కె.వెంకట్రావు మాట్లాడుతూ పెయ్యదూడల ఉత్పత్తి పథకం ద్వారా లింగ నిర్ధారిత వీర్యాన్ని ఉపయోగించడంతో రైతులకు మేలైన పెయ్యదూడలను 90శాతం ఖచ్చితంగా అందించవచ్చునని తెలిపారు. తద్వారా పాల దిగుబడి పెరగడంతో పాటు రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. మూడేళ్ల కాలపరిమితికి రూ.288 ప్రీమియం చెల్లిస్తే పశువులకు రూ.30వేల బీమా సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందని వివరించారు. లేగదూడల అందాల పోటీల్లో ప్రథమ బహుమతి నక్కా శేషగిరిరావు (పుంగనూరు ఆవుదూడ), ద్వితీయ బహుమతి నడింపల్లి కాశీవిశ్వనాథరాజు (గిర్ ఆవుదూడ), తృతీయ బహుమతి మామిడిపల్లి బాబు (పుంగనూరు ఆవుదూడ) స్థానాలు సాధించాయి. పెయ్యదూడల రైతులకు ఎమ్మెల్యే ఆనందరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ కర్రిడి మూర్తి, సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయారెడ్డి, డాక్టర్ చీకట్ల వెంకటనారాయణ, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, చిందాడగరువు సర్పంచ్ పొణకల గణేష్, ఎంపీటీసీ పరమట నాగమణి, పశువైద్యులు డాక్టర్ మాధురి, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ హెబ్సిబా, పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను బదిలీ చేయాలని నిరాహార దీక్ష



దీక్ష చేస్తున్న కోఆప్షన్ సభ్యుడు వెంకటేశ్వరరావు, సంఘీభావం తెలుపుతున్న స్థానికులు

- కోఆప్షన్ సభ్యుడు వెంకటేశ్వరరావుకు సంఘీభావం తెలిపిన సర్పంచ్, స్థానికులు
- ఎమ్మెల్యే ఇచ్చిన హామీతో దీక్ష విరమణ

పి.గన్నవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ముంగండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.కనకదుర్గను ఇక్కడ నుంచి తక్షణ బదిలీ చేయాలని పాఠశాల కో-ఆప్షన్ సభ్యుడు, డోనరు పినిశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణలో మంగళవారం ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. ఆయనకు పోతవరం గ్రామసర్పంచ్ వడలి కొండయ్య, స్థానిక సర్పంచ్ భర్త కుసుమ వెంకటేశ్వరరావు, పలువురు స్థానికులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో తాను గేటు బాగుచేయిస్తే నన్ను దొంగలా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులు, సిబ్బందిపై హెచ్‌ఎం చాలా ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ఎంఈవో కె.హెలీనా పాఠశాలకు చేరుకుని విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించారు. దీంతోరామచంద్రపురం డిప్యూటీ ఈవో పి.శ్రీరామలక్ష్మణమూర్తి శిబిరం వద్దకు చేరుకుని వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. హెచ్‌ఎంను బదిలీ చేయాలని అప్పటి వరకు దీక్ష కొనసాగు తుందని వారు తేల్చిచెప్పారు. ఎమ్మెల్యే, ఉన్న తాధికారులతో డీవైఈవో ఫోన్‌లో మాట్లాడారు. విచారణ పూర్తయిన వెంటనే చర్యలు ఉంటాయని, మీరు అనుకున్నట్టే జరుగుతుందని నిరసనకారులకు డీవైఈవో హామీ ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరంలో హెచ్‌ఎంను బదిలీ చేయకపోతే మీతో పాటు పోరాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని స్థానిక నాయకులు చెప్పారు. దీంతో వెంకటేశ్వరరావుకు డీవైఈవో నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. అలాగే హెచ్‌ఎం వేధింపులు తాళలేక ఈఏడాది ఫిబ్రవరి 22న ఉపాధ్యాయురాలు డి.ఎస్. డి.లావణ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఉపాధ్యాయులందరూ నిరసనకు దిగిన విషయం విదితమే.

ధరిత్రి దివస్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సంస్కారభారతి జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ధరిత్రి దివస్‌లో భాగంగా జిల్లాశాఖ అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి ఆధ్వర్యంలో కళాశాల రోడ్డులోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భూ అలంకరణ పోటీలు నిర్వహించారు. ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వీవీఆర్ నాయుడు, రంగోళీ ప్రముఖ్ వాసంశెట్టి శ్రీదేవి, కార్యవర్గ సభ్యుడు శ్రీగిరి గోపాలకృష్ణ, ఈవని సాయికృష్ణ, పేరి లలిత, శిష్లా శ్రీహరి, బూరగాయల శివరామకృష్ణ, యర్రమిల్లి అనంతలక్ష్మి, కృష్ణవేణి, వేదనభట్ల కళాపూర్ణారావు, కూచిమంచి సుజాత, పుత్సా కృష్ణకామేశ్వర్ పాల్గొన్నారు.

సీమంతాలు

అంతర్వేది, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది, అంతర్వేదిపల్లిపాలెం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పోషణ్‌పక్వాడా కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు. రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి ఆధ్వర్యంలో వివిధ అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ్ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల8 నుంచి 22వరకు సదస్సులు జరుగుతాయని సీడీపీవో తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ మీరా మున్సీసా, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే సఖినేటిపల్లి మండలం సంజీవయ్య కాలనీ, రామేశ్వరం జీవీ గ్రూపులో ఎంపీపీ స్కూలు అంగన్‌వాడీ సెంటర్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు.

తరగతులు పెంచాలని నిరసన

రాజోలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ములికిపల్లి బాలయోగి కాలనీలో ఉన్న మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి వరకు తరగతులను పెంచాలని పాఠశాల ఆవరణలో మంగళవారం తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ఈపాఠశాలలో ప్రస్తుతం మూడో తరగతి వరకు మాత్రమే ఉందని, దానిని 5వ తరగతి వరకు పెంచాలని ప్రభుత్వాన్ని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

కొరియర్ ద్వారా ప్రసాదం

ఐ.పోలవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి నిత్యకల్యాణానికి హాజరుకాలేని భక్తులకు కొరియర్ ద్వారా ప్రసాదం అందించే కార్యక్రమానికి దేవస్థానం శ్రీకారం చుట్టింది. గతంలో సాధారణ పోస్టు ద్వారా మాత్రమే ప్రసాదం అందించేవారు. ప్రతిరోజు 120మంది భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొంటారు. వారి సౌకర్యార్థం వివిధ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రసాదం, స్వామి, అమ్మవారి ఫొటోలు కూడా పంపిస్తున్నారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ మండల అధ్యక్షుడిగా దొంగ

రాజోలు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాజోలు మండల అధ్యక్షుడిగా దొంగ సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజోలులో బీసీ ఉద్యోగుల మండల సంఘం నూతన కమిటీ ఎన్నిక అప్పారి దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు బొక్కా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కారాడి వెంకటనరసింహరాజు ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించారు. గౌరవాధ్యక్షుడిగా బిళ్ల రాచయ్య, ప్రధాన కార్యదర్శిగా రేవు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా గుబ్బల సత్యనారాయణ, టి.శ్రీనివాసచక్రవర్తి, ఆర్థిక కార్యదర్శిగా దొమ్మేటి శ్రీనివాస్, గౌరవ సలహాదారునిగా బి.బృహస్పతి, ఎం.నరసింహారావు, ఎన్.పుల్లయ్య, ఎ.దుర్గాప్రసాద్, జిల్లా కౌన్సిలర్‌గా కట్టా జగన్మోహనరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీని పితాని వెంకటేశ్వరరావు, ఎ.రవికుమార్, కె.బాలాజీ అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికే నూతన విద్యా విధానం



నారాయణపేటలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి సూర్యప్రకాశం తదితరులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు వినూత్న రీతిలో విద్యార్థులను ఆకర్షించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు మీకు ఆహ్వానం అంటూ నూతన పద్ధతిలో ప్రచారం చేపట్టారు. ఎక్కడికో ఎందుకు దండగ. ప్రభుత్వ బడి మన ఊరిలో ఉండగా.. ఫీజులు ఎందుకు దండగా ఇంగ్లీషు మీడియం మన ఊరిలో ఉండగా అంటూ నారాయణపేటలోని శ్రీలాల్‌బహదూర్‌శాస్త్రి మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బీవీఎస్‌సీ పోలిశెట్టి, చైర్మన్ పేకేటి సత్యవాణిల ఆధ్వర్యంలో కరపత్రాలతో ప్రచారం చేపట్టారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహణ కమిటీ తల్లిదండ్రుల సమావేశం పోలిశెట్టి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికే ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందని డీవైఈవో పేర్కొన్నారు. నాణ్యమైన గుణాత్మక విద్య అర్హులైన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని కమిషనర్ రాజు పేర్కొన్నారు. అనంతరం పాఠశాల తరపున ముద్రించిన బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ పేకేటి సత్యవాణి, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.ప్రభాకర్, సీఆర్పీ ఎం.అనూష, ఉపాధ్యాయులు కె.విజయకోమలి, డి.దుర్గారావు, సరాగుల గోపీరాజు, డి.షర్మిళతో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గర్భిణులకు సీమంతాలు.. చిన్నారులకు అన్నప్రాసన



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సీడీపీవో విమల

ముమ్మిడివరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండగలుగుతారని ఐసీడీఎస్ ముమ్మిడివరం సీడీపీవో ఐ.విమల పేర్కొన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం ఆరుగురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించి ఆరు నెలలు నిండిన ఐదుగురు చిన్నారులకు అన్నప్రాసన జరిపారు. సీడీపీవో విమల మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లులు, గర్భవతులకు వెయ్యి రోజుల సంరక్షణ, పోషకాహారం,రెండు సంవత్సరాలపిల్లల పోషణ స్థితి, ఒబెసిటీ అంశాలను వివరించారు. కార్యక్రమంలో జీవీఎస్ఎన్ దేవి, జె.మీనాక్షి, సీహెచ్ పల్లవి, ఆకాశ్ పాల్గొన్నారు.

తల్లికి పాదాభివందనం



ఉప్పలగుప్తం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం శాంతి పబ్లిక్ స్కూల్లో మంగళవారం మాతృమాత-మాతృభూమి-మాతృభాష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంటర్నేషనల్ యూత్ ఐకాన్ అవార్డు గ్రహీత చిక్కం సాంబశివరావు మాట్లాడుతూ నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లి, మాతృభూమి, మాతృభాష గొప్పదనాన్ని వివరించారు. స్కూల్ నిర్వాహకుడు శాంతిస్వరూప్ ఆధ్వర్యంలో విద్యార్థులు తల్లులకు పాదపూజా కార్యక్రమం జరిగింది. తల్లులు తమ పిల్లలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చిక్కం వెంకటసత్యప్రసాద్, జయలక్ష్మి, శివరావుమాస్టారు, నాగేంద్రకుమార్, కళ్యాణి, గౌతమ్‌గౌడ్, భవాని, డి.లక్ష్మి, దుర్గాదేవి, వనిత, రాజేశ్వరి, సత్యవేణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై మల్లాడి సమీక్ష

యానాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): యానాంలో మున్సిపాలిటీ, ప్రజాపనులశాఖ, సీఎస్ఆర్ ద్వారా చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై అధికారులతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్‌ఏ మునిస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్, ప్రజాపనుల శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంకా చేయాల్సిన పనులపై చర్చించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యానాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గం పరిధిలో అన్ని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని యానాం విద్యుత్ శాఖ ఏఈ ఎం.సత్యనారాయణమూర్తి తెలిపారు. 220 కేవీ కాకినాడ సబ్‌స్టేషన్, 132కేవీ ప్రతాప్‌నగర్ సబ్‌స్టేషన్‌లో ఏపీ ట్రాన్స్‌కో వార్షిక నిర్వహణ, మరమ్మతు కోసం బుధవారం ఉదయం 7.30నుంచి మధ్యాహ్నం 12.30వరకు యానాం ప్రాంత అంతా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా సీత

అమలాపురం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీ సంస్థ కోనసీమ రచయితల సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా యెండూరి సీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉన్న సీత-సత్యనారాయణ(చంటి) దంపతులను కోనసీమ రచయితల సంఘం తరపున మంగళవారం సత్కరించి మెమొంటో అందజేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, కార్యదర్శి నల్లా నరసింహమూర్తి, కడలి సత్యనారాయణ, కడలి రామకృష్ణారావు, శ్రీపాద రామకృష్ణ పాల్గొన్నారు.

రెండు తువ్వమట్టి లారీల స్వాధీనం

పి.గన్నవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మానేపల్లి గ్రామపరిధిలో ఉన్న తువ్వమట్టి ర్యాంపునకు అనుమతులు ముగిసినప్పటికి మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. నాగుల్లంక శివారు కందాలపాలెంలో తువ్వమట్టి తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్టు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. నిబంధనలు అనుసరించి లారీల యజమానులకు జరిమానా విధిస్తామన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అజయ్‌కుమార్



అజయ్‌కుమార్



వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): అమలాపురం బార్‌అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ కటికదల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి నూతనకార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చింతపల్లి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా యాలంగి సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి దొమ్మేటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పి.వీరభద్రరావు, గ్రంధాలయ కార్యదర్శిగా కె.శశిధర్‌శ్రీరామ్, కోశాధికారిగా నందెపు చినవెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా మహ్మద్ ఆజామ్, నల్లా ప్రభాకర్, ఏవీఎస్‌ప్రసాద్, ఎన్.సీతారామరాజు, కేఎస్‌సీ హెచ్ మోహన్, వైవీఎస్ఎస్ఎన్‌ప్రసాద్, కళా వెంకట్రావు, అబ్బిరెడ్డి సురేష్, కేవీవీ శ్రీనివాసరావు, దాసరి శ్రీలత, పీవీ ఆనంద్‌ప్రసాద్, ఎల్బీ సత్యనారాయణలను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులు బారిన పడకుండా పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా ధాన్యాన్ని కొనుగోలుచేసి ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు నేరుగా జమ అవుతుందన్నారు. వన్నెచింతలపూడి పీఏసీఎస్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నడింపల్లి అర్జున్‌వర్మ, నడింపల్లి రాంబాబురాజు, దంతులూరి వాసురాజు, గ్రామసర్పంచ్ నక్కా రాజారత్ననాగమణి, నక్కా కృష్ణ, మాజీ సర్పంచ్ పాలాటి బాలయోగి, పరమట చిట్టిబాబు, పరమట రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని ఉమాసోమేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో క్షత్రియ కల్యాణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అధిక సంఖ్యలో కూటమి నాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాద బీమా రూ.5లక్షలు..: ఇటీవల పాలగుమ్మి గ్రామానికి చెందిన బొక్కా రవికుమార్ ప్రమాద వశాత్తూ జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. టీడీపీ ప్రమాద బీమా రూ.5లక్షల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రవికుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి వెంకటేశ్వరరావు, బొక్కా శ్రీరామమూర్తి, కుడుపూడి వెంకటేశ్వరరావు, చంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చెంపపై కొట్టిన ఉపాధ్యాయినిపై ఫిర్యాదు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఐఎమైండ్స్ స్కూలులో 4వతరగతి చదువుతోన్న యెరుబండి గనిశ్రీ మంగళవారం కంప్యూటర్ పరీక్ష సరిగా రాయలేదని ఉపాధ్యాయిని ఆ విద్యార్థిని చెంపపై కొట్టడంతో కింద పడిపోయింది. దీనిపై విద్యార్థిని తండ్రి నల్లావీధికి చెందిన యెరుబండి సురేష్ పట్టణ సీఐ పి.వీరబాబుకు ఫిర్యాదుచేశారు. ఇరువర్గాల వారిని సీఐ పిలిపించారు. ఇదేమిటని అడిగినందుకు టీసీ ఇచ్చి పంపించేస్తామని బెదిరిస్తున్నట్టు విద్యార్థిని తండ్రి ఆవేదనవ్యక్తం చేశారు.

అసిస్టెంట్ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

యానాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): యానాంలో ఈనెల 27వ తేదీన జరగాల్సిన అసిస్టెంట్ రాత పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు యానాం పరిపాలనాధికారి మునిస్వామి తెలిపారు. పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల27న రాత పరీక్ష నిర్వహించనున్నారు. యానానికి సంబంధించి 1,705మంది అభ్యర్థులు రాత పరీక్ష రాయనున్నారు. యానాంలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, పీఎంశ్రీ రాజీవ్ గాంధీ ప్రభుత్వ పాఠశాల, డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ పాఠశాల, మెట్టకుర్రులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్‌లలో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 10నుంచి 12గంటలకు వరకు జరిగే పరీక్షకు సంబంధించి అభ్యర్థులను 8గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. 9.30గంటలు దాటితే అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్, గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

సంపద తయారీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

అల్లవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీపై పంచాయతీల కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎల్పీవో పి.బొజ్జిరాజు కోరారు. మండలంలోని తుమ్మలపల్లి, కోడూరుపాడు, గోడి, మొగళ్లమూరి, బోడసకుర్రు, కొమరగిరిపట్నంల్లో సంపద తయారీ కేంద్రాల షెడ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. నాడెపు తొట్టెల్లో ప్రాథమిక కంపోస్టు, వర్మీ కంపోస్టు విధానాలపై కార్యదర్శులకుసూచనలిచ్చారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తల ను వృధా చేయకుండా ఎరువు తయారు చేయాలన్నారు. డీఎల్పీవో ంఎట డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, కార్యదర్శులు పి.సత్యనారాయణ, చిక్కం శ్రీనివాస్, మానే కనకమ్మ, సిబ్బంది వున్నారు.

విద్యార్థులకు ధ్రువపత్రాల పంపిణీ

అయినవిల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్న్‌షిప్ చేసిన పదో తరగతి విద్యార్థులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు పదిహేను రోజుల పాటు ఇంటర్న్‌షిప్ సంతృప్తికరంగా పూర్తిచేసిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా బాలికా, శిశు సంక్షేమ అధికారి ఎంవీకే భీమారావు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆటోమోటివ్ ట్రైనర్ వై.వెంకటేష్, అగ్రికల్చర్ ట్రైనర్ కె.కమలప్రియ, ఎలక్ట్రానిక్స్ ట్రైనర్ పి.రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

అంబాజీపేట, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట నాగమల్లిచెట్టు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం హెచ్‌ఎం వాడ్రేవు సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈపాఠశాల మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తింపు పొందిందని హెచ్‌ఎం తెలిపారు.ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎస్ఎంసీ ఛైర్మన్ దిగుమర్తి లక్ష్మి, సీఆర్పీ వెంకటేష్, ఉపాధ్యాయులు కుమారి, వరలక్ష్మి, సత్యవేణి, శ్రీదేవి పాల్గొన్నారు.

శ్యామలాంబ అమ్మవారి తీర్థం

అల్లవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): డి.రావులపాలెం గ్రామ దేవత శ్యామలాంబ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని చీరలు, మొక్కుబడులు చెల్లించారు.

ఉపాధ్యాయురాలిగా వెంకటలక్ష్మి సేవలు ఆదర్శనీయం



గుత్తులవారిపాలెం యూపీ స్కూలులో మరువాడ వెంకటలక్ష్మి శర్మ దంపతులను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

అల్లవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలిగా విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసి అందరి మన్ననలు పొందిన మరువాడ వెంకటలక్ష్మి సేవలు ఆదర్శనీయమని అధికారులు, నాయకులు, పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అల్లవరం గుత్తులవారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయురాలు మరువాడ వెంకటలక్ష్మి ఉద్యోగ విరమణ చేశారు. మంగళవారం ఎస్టీయూ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు, ఆర్టీసీ ఉద్యోగులు, నాయకులు దుశ్శాలువాలు కప్పి వెంకటలక్ష్మి, కృష్ణసత్యనారాయణశర్మ (ఆర్టీసీ) దంపతులను సన్మానించారు. గుబ్బల రామ్‌ప్రసాద్, గంటి వీఎల్ఎన్ శర్మ(అబ్బీస్), కంకిపాటి వీరబాబు, మరువాడ వెంకటేశ్వరశర్మ, కె.లక్ష్మీనారాయణ, ఎంఈవో-1 కె.కిరణ్‌బాబు, ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, ఆర్వీఎస్ శేఖర్, నరిదే సత్యపల్లంరాజు, కేటీజేమోహనరావు, తోట బాలకృష్ణ, హెచ్‌ఎం డి.నాగలక్ష్మి, కల్యాణలక్ష్మి, రాసూరి రాంబాబు, ఏవీఆర్ఎస్ మహదేవ్ శర్మ, జె.మణిశంకర్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్‌లో సమగ్ర శిక్షాలో పనిచేస్తోన్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత 15 సంవత్సరాలకు పైగా సిబ్బంది తక్కువ వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్నారన్నారు. మన బడి-మన భవిష్యత్తు, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు, బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించుటవంటి ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు.డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రత్యేక వెయిటేజీ కల్పించాలని సమగ్ర శిక్షా సిబ్బంది తరపున కూటమి నాయకులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్టు వెంకన్నబాబు తెలిపారు. శుక్రవారం కార్యాలయం వద్ద ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని 26,27 వార్డుల్లో టీడీపీ సభ్యత్వ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి సభ్యత్వ కార్డులను పట్టణ ప్రధాన కార్యదర్శి భాస్కర్ల రామకృష్ణ, వార్డు కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రాంబాబు, సుబ్బాలమ్మ దేవస్థానం ఉత్సవకమిటీ ఛైర్మన్ పెద్దిరెడ్డి సాయిపుల్లయ్యనాయుడు, తొమ్మంద్రు గోపీ ఆధ్వర్యంలో కార్డుల పంపిణీ నిర్వహించారు. చిక్కాల అబ్బు, భాస్కర్ల రవితేజ, కొప్పుల బాబీ, యండమూరి సత్తిబాబు పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

మామిడికుదురు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ డెంగ్యూ, మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం ఆయన నగరం పీహెచ్‌సీని సందర్శించి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీలో గల రక్త పరీక్షల కేంద్రాన్ని పరిశీలించి డెంగ్యూ, మలేరియా నిర్ధారణ కిట్లు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.స్వర్ణలత, సీహెచ్‌వో కేఎస్ సత్యవతి, పీహెచ్ఎన్ జయకుమారి, సూపర్‌వైజర్లు బీవీవీ సత్యనారాయణ, పీవీఎన్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

అంబాజీపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావుపూలేను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. జ్యోతిరావు పూలే, అంబేద్కర్ జయంత్యుత్సవాలు పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ప్లేబ్యాక్ టు సొసైటీ ఆర్గనైజేషన్ నిర్వాహకులు నక్కా భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, అరిగెల సూరిబాబు, కొర్లపాటి కోటబాబు, అరిగెల బలరామమూర్తి, ఖైలా ఆనందరావు, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మెకా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

ఐ.పోలవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ మంగళవారం ఆలయ అర్చక, పురోహిత బృందంతో చర్చించారు. మేనెల ఒకటో తేదీ నుంచి 5వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. శైవాగమ పండితుడు బ్రహ్మశ్రీ యనమండ్ర సీతారామశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మే 1న జరిగే స్వామి బ్రహ్మోత్సవ కల్యాణానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు హాజరవుతారన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

'పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి'

మండపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోగల వినియోగదారులు ఆస్తిపన్ను చెల్లించి పన్ను రాయితీని పొందాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 30 వరకు పన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీఉందని ఆయన అన్నారు.

వెదురుపాకలో నిలిచిన

ఎండీయూ వాహనం సేవలు

● చౌక దుకాణాల వద్ద కార్డుదారులకు సరుకుల పంపిణీ

● మే నెలలోనైనా రేషన్ కష్టాలు తప్పేనా?


వెదురుపాక సచివాలయం వద్ద ఉన్న ఎండీయూ వాహనం

రాయవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఇంటింటికీ తిరిగి రేషన్ పంపిణీ చేసే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనం సేవలు రాయవరం మండలం వెదురుపాక గ్రామంలో నిలిచిపోవడంతో రేషన్ కార్డుదారులు చౌకదుకాణల వద్ద రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటంతో మళ్లీ పాతరోజులు వచ్చి రేషన్ షాపుల వద్ద రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి రావడంతో ప్రజలకు రేషన్ కష్టాలు తప్పడం లేదు. వెదురుపాక ఎండీయూ వాహనం ఆపరేటర్‌గా పనిచేసిన వాసు రాజీనామా చేశారు. ఖాళీగా ఉన్న ఎండీయూ ఆపరేటర్ స్థానంలో ఎవర్నీ ఎండీయూ ఆపరేటర్ నియామకం జరగలేదు. ఈఏడాది ఫిబ్రవరి రేషన్ సరుకులు ఎండీయూ వాహనంవద్ద తీసుకున్న వెదురుపాక ప్రజలు మార్చినెల, ఏప్రిల్ నెల సరుకులు గ్రామంలో ఉన్న రేషన్ దుకాణాల వద్ద తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో ప్రతి వీధికి వెళ్లి ఇంటింటా రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనం సేవలు లేక వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు సైతం సులభంగా ఇంటి వద్ద రేషన్ తీసుకునేవారు. మే నెలలో రైతులకు ముమ్మరంగా వరికోతల పనులు సమయం కావడంతోపాటు వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహశీల్దారు ఐపీ శెట్టిని వివరణ కోరగా ఎండీయూ ఆపరేటర్ నియామకానికి ప్రపోజల్స్ పంపామని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే నియామకం చేపడతామన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.43లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అష్టోత్తర పూజలు, ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో మాసకల్యాణం దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 22(ఆంధ్ర జ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ2,43, 899 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లంసూర్యచక్రధరరావు తెలిపారు.

కేశవస్వామికి మాస కల్యాణం

పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈవో రమణమూర్తి ఏర్పాట్లు చేశారు.

మెరుగైన విద్యను అందించేందుకు కృషి : ఎమ్మెల్యే బండారు


విద్యార్థులతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, ఏప్రిల్ 22(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం రావులపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం సునీత ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు సౌకర్యాలు కల్పించేందుకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ గెద్దం త్రిమూర్తులు, ఎంఈవోలు నాగకుమార్, శ్రీనివాసరాజు, సర్పంచ్ మట్టా సత్యాదేవి, బాబ్జి, ఎంపీటీసీ కిషోర్, నెక్కంటి వెంకన్న, పెచ్చెట్టి చిన్నారావు, గెద్దం శ్రీను, నాగార్జున, జ్యోతిబసు, కేవీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కొమరాజులంకలో ఇసుక ర్యాంపు బాటవద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

ఇసుక ర్యాంపులో వైసీపీ నేత ఎక్స్‌కవేటర్

●అడ్డుకున్న టీడీపీ జనసేన నాయకులు

రావులపాలెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇసుక ర్యాంపులో వైసీపీ నేతకు చెందిన ఎక్స్‌కవేటర్‌ని వినియోగించడంతో టీడీపీ, జనసేన నాయకులు అ డ్డుకున్న ఘటన మంగళవారం జరిగింది. కొత్తపేట మండలం మందపల్లి సమీపంలో ఉన్న ఆలమూరు ఇసుక ర్యాంపులో కొంతకాలంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ ఇసుక ర్యాంపులో రావులపా లెం మండలం కొమరాజులంక సర్పంచ్‌కు చెందిన ఎక్స్‌కవేటర్‌ని వినియోగిస్తుండటంతో గ్రామానికి చెందిన టీడీపీ,జనసేన నాయకులు అడ్డుకున్నారు. బాట మార్గంలో లారీలను నిలుపదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం రూ.50లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ పనులు నిర్వహించేందుకు పంచాయతీ తీర్మానం అడగ్గా సర్పంచ్ ఇవ్వకపోవడంతో ఆ నిధులు వేరే గ్రామానికి వెళ్లిపోయాయని ఆరోపించారు. అలాంటి వ్యక్తికి చెందిన ఎక్స్‌కవేటర్‌ని ఇసు క ర్యాంపులో ఎలా వినియోగిస్తారని ప్రశ్నించారు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ విద్యాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని వారితో చర్చించారు. అనంతరం ఇసుక తవ్వకాలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను పక్కకు పెట్టించడంతో పాటు తవ్వకాలు నిలుపుదల చేయడంతో వివాదం సద్దుమణిగింది.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

● కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు కామన డిమాండ్

మండపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) రైతు కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభా కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండపేట ఏడిదరోడ్డులో వున్న కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యంను కొనుగోలు చేయటంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. గుంటూరు జిల్లా పెదకూరపాడుకు చెందిన రైతు షేక్‌యాసిన్ ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని గిట్టుబాటు ధర రాక చేతికి వచ్చిన పొగాకు పొలంవద్ద ఆరబెట్టగా తడిసిపాడవటంతో వ్యాపారులు పొగాకును క్వింటాళ్లకు రూ.18000 ఇస్తామని వ్యాపారులు చెప్పి తీరా వ్యాపారి వద్దకు వెళ్లేసరికి క్వింటాళ్లకు రూ.200 ఇస్తామని చెప్పటంతో దిక్కుతోచని స్థితిలో రైతు మనస్తాపం చెంది పండించిన పంటకు నిప్పుపెట్టిన సంఘటన చాలా బాధా కరమని కామన అన్నారు.

ఎవరి జేబులు నింపేందుకు డ్రైన్లలో సిల్ట్ తొలగింపు

కౌన్సిల్ సాధారణ సమావేశంలో మండిపడ్డ కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం(ద్రాక్షారామ),ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎవరిని సంతృప్తి పరిచేందుకు, జేబులు నింపేందుకు ఏడాది తిరగకుండా మళ్లీ మేజర్ డ్రైన్లలో సిల్ట్ తొలగింపు పనులు ప్రతిపాదించారని పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. మంగళవారం రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎజెండాలో రెండవ అంశం పట్టణంలో మేజర్ డ్రైన్లలో సిల్ట్ తొలగించేందుకు రూ.44 లక్షలతో ప్రతిపాదించిన పనిపై కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, జనసేన కౌన్సిలరు అంకం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఏడు నెలల క్రితం రూ.56లక్షలతో సిల్ట్ తొలగింపు పనులు పూర్తి చేశారని ఇప్పటి వరకు కాంట్రాక్టరుకు బిల్లు కూడా చెల్లించలేదని మళ్లీ ఇప్పుడు 44 లక్షలతో అవే డ్రైన్లలో సిల్ట్ తొలగింపు ఎలా ప్రతిపాదిస్తున్నారని నిలదీశారు. గతంలో అయిదారేళ్లకు ఒకసారి సిల్ట్ తొలగించేవారన్నారు. ఎజెండాలో ఈ అంశం ప్రజల్లోకి వెళ్లిందని మున్సిపల్ ఉన్నతాధికారులు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారని శ్రీనివాస్ అన్నారు. ప్రజలు గాని, కౌన్సిలర్లు ఎవరైనా విన్నవించారా అంటూ అంకం శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎవరిని సంతృప్తి పరిచేందుకు, జేబులు నింపేందుకు పనులు ప్రతిపాదించారని ప్రశ్నించారు. కమిషనర్ అయ్యప్పనాయుడు మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సిల్ట్ తొలగింపు ప్రతిపాదనలు పెట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్త పాలసీ అయినప్పటికీ సిల్ట్ తీసి 7 నెలలు మాత్రమే అయ్యిందని మరో మూ డేళ్లవరకు సిల్ట్ తీయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కౌన్సిల్ అధికారం చేపట్టి నా లుగేళ్లు పూర్తయ్యిందని పట్టణంలో కాంప్లెక్ ఎదురుగా శ్మశానం కనీస సౌకర్యాలు లేకుండా అంతిమ సంస్కారాలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారని, పేర్రాజు పంతులు గ్రౌండ్‌లో ఓపెన్ ఎయిర్ జిమ్‌లో పరికరాలు పాడయ్యాయని అటువంటి పనులు చేపట్టమని ఎన్నిసార్లు కోరినా స్పందించడం లేదన్నారు. డ్రైన్లలో సిల్ట్ తొలగింపు అంశాన్ని కౌన్సిలర్లు ఏకపక్షంగా తిరస్కరించారు. రూ.40 లక్షలతో వివిధ వార్డులో నామినేషన్ పద్ధతిపై అభివృద్ధిపనులు కేటాయింపును గతంలో కౌన్సిలర్లు తిరస్కరించగా ఈ సమావేశంలో టెండర్లు ద్వారా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఏజెండాలో పొందుపరచిన అంశాన్ని కౌన్సిలర్లు ఆమోదించారు. వైసీపీ చీఫ్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులపై క్వాలిటీ కంట్రోల్ పర్యవేక్షణకు ఏడాదికి మున్సిపాల్టీ నుంచి రూ.2లక్షలు చెల్లిస్తున్నామని ఎక్కడా జరిగిన అభివృద్ధి పనులపై క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధులు పనులు తనిఖీ చేసి సర్టిఫైచేసిన సందర్భం ఉందా అని విమర్శించారు. పట్టణం లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.3.50 లక్షలతో చేసిన అంశాన్ని కూడా కౌన్సిలర్లు తిరస్కరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సత్కారం

రామచంద్రపురం మున్సిపల్‌కమిషనర్‌గా పనిచేస్తూ విశాఖపట్టణం జి.వి. ఎం.సికి బదిలీ అయిన ఒమ్మి అయ్యప్పనాయుడును మంగళవారం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరరావు, కొలమూరి శివాజీ, కౌన్సిలర్లు వాడ్రేవు సాయిప్రసాద్, అంకం శ్రీనివాస్, గుబ్బల గణపతిరావు, పెంటపాటి దేవి, తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌ను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి, కౌన్సిలర్లు

గ్రామీణ ప్రజలకు ఉపాధి పథకం ఎంతో మేలు : మంత్రి సుభాష్


బాలాంత్రం చెరువు పనులు ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి హామీ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం బాలాంత్రం గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవం అయృత సరోవర్ పథకం అమల్లో భాగంగా స్థానిక చెరువు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. రూ.9.96 లక్షలతో చేయనున్న పనులు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు పనుల కోసం వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పథకం ఉపయోగ పడుతుందని చెప్పారు. మరోవైపు మెటీరియల్ కాంపోనెంట్ ఉపాధి పనులు మూలంగా గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని చెప్పారు. మిషన్ అమృత సరోవర్ పథకంలో ప్రతీ జిల్లాలోను చెరువులను అభివృద్ధి చేసి నీటి సంరక్షణ చేయడం ప్రధాన ఉద్దేశమని అన్నారు. అనంతరం గ్రామంలో ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న దాట్ల శ్రీను ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.పదివేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఎంజీఎన్ఆర్ జీఎస్ ఏపీవో గణపతి, ఈసీ సాగర్, ఎంపీపీ పంపన నాగమణి, కూటమి నాయకులు మల్లిపూడి బుజ్జి, తోట వెంకన్న, మేడిశెట్టి రవికుమార్, ఓలేటి శ్రీకృష్ణ, యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆర్థికసాయం: ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి మంత్రి సుభాష్ ఆర్థిక సాయం చేశారు. యర్రపోతవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వాసంశెట్టి సత్తిబాబు కుమార్తె ఉమాగౌతమి రావులపాలెం ప్రకాష్ కాలేజీలో చదువుతుంది. మొన్న పరీక్షల్లో కాలేజీ టాపర్‌గా నిలిచింది. దీంతో మంగళవారం మంత్రి సుభాష్ ఉమా గౌతమికి రూ.పదివేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా గౌతమి చదువు బాధ్యతలు తీసుకుంటామని కుటుంబానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బలుసు శివప్రసాద్, ఎదుర్లయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ కలలుగన్న సమాజం స్థాపిద్దాం

ద్రాక్షారామ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచమేధావి, మహోన్నతుడు డా.బి.ఆర్ అంబేడ్కర్ సమసమాజ స్థాపనకు పాటుపడ్డారని అంబేడ్కర్ కలలుగన్న సమాజాన్ని స్థాపిద్దామని మంత్రి సుభాష్ అన్నారు. మంగళవారం రామచంద్రపురం మండలం చోడవరంలో అం బేడ్కర్ జయంత్యుత్సవాల్లో పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ప్రపంచంలో అత్యుత్తమ రాజ్యాంగాన్ని అంబేడ్కర్ దేశానికి అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, దళిత సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణల తొలగింపు

ఆలమూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చొప్పెల్ల ఆర్అండ్‌బీ రోడ్డుపై ఉన్న ఆక్రమణలను మంగళవారం తొలగించారు. రోడ్డుపై ఆక్రమణలపై పలు ఫిర్యాదుల నేపథ్యంలో ఎంపీడీవో ఎ.రాజు, పంచాయతీ కార్యదర్శి ఎం.విజయరెడ్డి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సాయంతో ఆక్రమణలను తొలగించే కార్యక్రమం ప్రారంభించారు. నేషనల్‌హైవే నుంచి గ్రామంలోకి వచ్చే ఆర్అండ్‌బీ రోడ్డు ఇరుపైపులా ఆక్రమణకు గురికావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మా రింది. దీంతో రోడ్డుపైకి ఉన్న ఆక్రమణలను ముందుగా గుర్తించి ఆమేరకు ఎక్స్‌కవేటర్ సాయంతో పంచాయతీ సిబ్బంది తొలగించారు. రోడ్డుపై ఆక్రమణలవల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని రోడ్లు ఆక్రమించ కుండా ప్రజలు గుర్తించాలని ఎంపీడీవో రాజు సూచించారు. ఆక్రమణ చేస్తే భవిష్యత్‌లో ఆక్రమణలు తొలగింపు చేయడంవల్ల తీవ్రంగా నష్టపోతారని అందువల్ల ముందుగానే ఈవిషయాన్ని గుర్తించి రోడ్డు ఆక్రమణలకు రావొద్దని ఆయన కోరారు.


ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

జ్యోతిష్య శాస్త్రంలో సుబ్రహ్మణ్యశర్మకు డాక్టరేట్


అంకంపాలెం శివాలయ అర్చకుడికి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 22(ఆంధ్ర జ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెం అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ అర్చకుడు కొత్తలంక వి.ఎస్.సుబ్రహ్మణ్యశర్మకు జ్యోతిష్యవాస్తు శాస్త్ర అధ్యయనంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. సింహాచలంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా బెంగుళూరుకు చెంది న శుక్రాచార్య వేదాంగ వెల్ఫు వల్ యూనివర్శి టీ, విశాఖపట్నానికి చెందిన వైఎస్ లైవ్ ఆస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఆస్ట్రాలజీ సెమినార్‌లో శర్మకు వాస్తు శాస్త్రంలో డాక్టరేట్ పట్టాను అందించారు. జ్యోతిష్య వాస్తు చక్రవర్తి అవార్డును అందుకున్నారు. శివశివాణి ప్రిన్సిపాల్ చైతన్య, కవి బ్రాహ్మజీ అభినందించారు.

మంత్రి సుభాష్‌కు కార్మిక సంఘాల వినతి

రామచంద్రపురం(ద్రాక్షారామ),ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, గతంలో మం జూరు చేసిన క్లెయిమ్స్‌లకు వెంటనే నిధులు చెల్లించాలని మంత్రి సుభాష్‌ను భవన నిర్మాణ కార్మికులు కోరారు. మంగళవారం మంత్రి సుభాష్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన కోర్కెలు రెండు నెలల్లో నెరవేరుస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నూక లబలరాం, జి.దుర్గాప్రసాద్, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా గౌరవాధ్యక్షుడు పిండి కాళిదాసు, అధ్యక్షులు విప్పర్తి మోహన్‌రావు, గంథం నారాయణమూర్తి, సలాది కిరణ్‌కుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ మేడిశెట్టి దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ధరిత్రిని రక్షించుకోవాలి'

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ధరిత్రిని రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని నల్లూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ రామలక్ష్మి అన్నారు. మండలంలోని నల్లూరు ఉన్నత పాఠశాల, శ్రమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవం స్కూల్ ఎన్రోల్‌మెంట్ సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శ్రమ కోఆర్డినేటర్ నాగేశ్వరి మా ట్లాడుతూ ధరిత్రిని రక్షించుకోవాలంటే ముఖ్యంగా ప్లాస్టిక్‌ను నిషేధించడంతో పాటు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో అని, బడిమానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పిద్దాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, శ్రమటీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ధ్రువపత్రాల అందజేత

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పీఎంసీ పాఠశాలలోని వృత్తి విద్యలో భాగంగా 12 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ శిక్షణ పొందిన మాచర ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు మంగళవారం హెచ్ఎంరమాదేవి వృత్తివిద్యా ధ్రువపత్రాలు అందజేశారు. పీఎంసీకి ఎంపికైన మాచర ఉన్నత పాఠశాలలోని వృత్తి విద్యపై శిక్షణ అనంతరం 12రోజులు ఇంటర్న్‌షిప్ నిర్వహించి ధ్రువప త్రాలు అందజేసినట్లు హెచ్ఎం రమాదేవి తెలిపారు. వృత్తివిద్యా శిక్షకురాలు లలిత, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కార్యదర్శి సాయిరామ్ మృతికి సంతాపం

రావులపాలెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గోపాలపురం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న నిమ్మకాయల సాయిరామ్ మృతి చెందడంతో ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక సచివాలయంవద్ద సర్పంచ్ సబ్బిత మోహనరావు, సచివాలయ ఉద్యోగులు నివాళులర్పించారు.

మాజీ జడ్పీటీసీ కృష్ణకు మాతృవియోగం

రాయవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి(కృష్ణ) తల్లి కర్రి పాపాయమ్మ మంగళవారం కన్నుమూశారు. మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ జడ్పీటీసీ కృష్ణను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మెన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. పాపాయమ్మ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఎస్‌వీ, రామారెడ్డి, సాయిరెడ్డి పాపాయమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఘనంగా లెనిన్ జయంతి

ద్రాక్షారామ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ లెనిన్ జయంతిని మంగళవారం రామచంద్రపురం మండలం వీరేశగుళ్లకాలనీలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాయలం వద్ద సీపీఐ మార్క్సిస్ట్, లెనినిస్ట్ జెండాను ఆవిష్కరించారు. లెనిన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అర్బన్ పీహెచ్‌సీలో గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి దొర

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):రామచంద్రపురంఅర్బన్ పీహెచ్‌సీలో గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహిస్తున్నామని ఈ సౌకర్యాన్ని గర్భి ణులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ దుర్గారావు దొర కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండపేట, రామచంద్రపురం అర్బన్ పీహెచ్‌సీల మెడికల్ అధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎంలకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ పిల్లలను 100 శాతం స్క్రీనింగ్ చేయాలని, హైపర్ టెన్షన్, డయాబెటీస్ ఇంటింటి సర్వే నిర్వహించి ఆన్‌లైన్ సర్వేలో నమోదు చేయాలన్నారు. ఆయిష్మాన్‌కార్డులు ఈకేవైసీ చేయాలని సూచించారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటున్న నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు అం దుబాటులో ఉంచుకోవాలని కోరారు. సమావేశంలో డివిజనల్ మెడికల్ అధికారి డా.ఎన్. ప్రశాంతి ప్రోగ్రాం అధికారి డా.హరీష్, సూపర్‌వైజర్ జి.కమలేశ్, మెడికల్ అధికారులు హేమసుధీర్, వీరభద్రరెడ్డి, భవానీ, రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : సీడీపీవో

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీవో ఎ.గజలక్ష్మి అన్నారు. మండపేట ప్రాజెక్టు పరిధిలో ఈనెల 8 నుంచి ప్రారంభమైన పోషణ పక్వాడా అవగాహన కార్యక్రమాలు ముగింపు సందర్భంగా మంగళవారం కపిలేశ్వరపురం సీడీపీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా లోగో ఏర్పాటుచేసి పౌష్టికాహారం ఆవశ్యకతను తెలియచేస్తూ 4 రకాల థీమ్స్‌ను అంగన్‌వాడీ కార్యకర్తలకు, గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఎన్‌జీవోలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కె.గంగవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకో వడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మంగళవా రం పామర్రులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహార ప్రదర్శన చేశారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం గురించి వివరించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పామర్రు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


గనిపోతురాజును దర్శించుకుంటున్న మంత్రి సుభాష్

ఘనంగా పోతురాజు సంబరం

కపిలేశ్వరపురం,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర పోతురాజుగూడెంలో ఉన్న కోణాలమ్మ సమేత పోతురాజు సంబరం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గరగనృత్యాలు, విచిత్రవేషాలు, కోలాహలంగా నిర్వహించారు. అశ్వవాహనంపై పోతురాజును అంగర, పడమరఖండ్రిక గ్రామ ప్రధాన రహదారుల్లో ఊరేగిస్తూ గ్రామోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూ జలు చేశారు. కార్యక్రమంలో విజయనగరం జోనల్ ఆర్టీసీ మాజీ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ, పోతురాజుగూడెం పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆలమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం సంధిపూడిలో కపిలేశ్వరపురం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ తోట భవానీవెంకటేశ్వర్లు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్యసేవలు అందించాలని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి సేవలలో భాగంగా సంధిపూడిలో వైద్యశిబిరం నిర్వహించి 103 మందికి వైద్య పరీక్షలు చేశారు. 20 మందికి శుక్లాల ఆపరేషన్ చేయడానికి గుర్తించి మొదటి విడతగా పది మందిని ఆసుపత్రికి తరలించారు. కంటి పరీక్షలు చేసిన వారికి కళ్లజోళ్లు, మందులు ఉచితంగా అందించారు. పలువురు కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి విరాళం

ఆలమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం కవలచర్లలో నూతనంగా పునర్‌నిర్మించిన రామాలయానికి గ్రామానికి చెందిన వడ్డి మణిబాబు కుటుంబసభ్యులు రూ.25వేలు విరాళం అందించారు. నూతన ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం ఆయన విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన దాత మణిబాబును కమిటీ సభ్యులు అభినందించారు.

కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు నాయకుల వినతి

మండపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కె.సత్యన్నారాయణ సారథ్యంలో బీజేపీ శ్రేణులు మంగళవారం అమలాపురంలో కలిసి నియో జకవర్గంలో పలు సమస్యలపై వినతిపత్రంను అందజేశారు. ద్వారపూడి గ్రామంలో జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ప్లస్‌టు జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. స్కూల్‌కమిటీ చైర్మన్ కె.మురళీ కృష్ణ జనసేన నాయకులు చింతా దొరబాబు, మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు వివరించారు.

ఘనంగా పుంతలో ముసలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం గ్రామంలో పుంతలో ముసలమ్మ ఆలయ ప్రతిష్ఠ పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు బండి వెంకటరామ సుబ్రహ్మణం, కూరెళ్ల సూర్యనారాయణమూర్తి, శివప్రసాద్ పర్యవేక్షణలో యాగశాల ప్రవేశం, వినాయకపూజ, పుణ్యాహవచనం, రక్షబంధనం, వాస్తు, నవగ్రహ మండపారాధనలు, అమ్మవారికి జలాధివాసం, పుష్పాదివాసం, అంకురారోపణ, తదితర పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం 10.42 నిమిషాలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం, మండప పునః పూజలు, పూర్ణాహుతి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. అనంతరం భారీ అన్న సమారాధన జరుగుతుందని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

'కుట్టుశిక్షణతో మహిళలను బలోపేతం చేయాలి'

ఆలమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చిన వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని రాష్ట్రప్రభుత్వ నిర్ణయంలో భాగంగా ఆలమూరు మండలంలో ఎంపిక చేసిన మహిళలకు ఆలమూరు, చొప్పెల్ల గ్రామాలలో కుట్టు శిక్షణను బీసీ కార్పొరేషన్ ద్వారా మొదలు పెట్టారు. కుట్టుశిక్షణలో మెలకువలు ఆధునిక విధానం తదితర అంశాలపై దాదాపు 90 రోజులపాటు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికేట్‌తోపాటు ఉచితంగా కుట్టుమిషన్ అందిస్తామని ఏపీఎం ధనరాజు తెలిపారు.